ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం అక్టోబరు 21, 2024

యువత విజయోత్సాహం



నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాల కబడ్డీ ఛాంపియన్ పోటీలు ఆదివారం మండపేటలో ఉత్సాహంగా ముగిశాయి. కాకినాడ ఐడియల్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. పాల్గొన్న క్రీడాకారుల్లో ప్రతిభ చూపిన వారితో సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు జట్టును నిర్వాహకులు ఎంపిక చేశారు. - న్యూస్‌టుడే, మండపేట

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవం



ఆత్రేయపురం: కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రం బ్రహ్మోత్సవ శోభతో అలరారుతోంది. ఉత్సవాలకు సోమవారం అంకురార్పణ ఘట్టాన్ని వైఖానస ఆగమశాస్త్రబద్ధంగా నిర్వహించనున్నారు. మూడు రోజులు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులపాటు స్వామివారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమీయనున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శేషవాహనంపై మాడ వీధుల్లో శ్రీమలయప్పస్వామి విహరిస్తారు.

● ముగ్గురు ఉద్యోగులకు ఛార్జి మెమో

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో భక్తులకు గదుల కేటాయింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు ఉద్యోగులకు ఛార్జిమెమో ఇస్తూ ఈవో కె.రామచంద్రమోహన్ ఆదేశాలిచ్చారు. సీనియర్ అసిస్టెంట్లు పెన్నాడ వెంకటేశ్వరరావు, ఎం.ఎల్ గణపతిరావు, రికార్డు అసిస్టెంటు పి.తలుపులయ్యలు మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. ఇటీవల వివాహాల రద్దీ సమయంలో వసతి గదులకు డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారికి, భక్తులకు ఇబ్బందులు లేకుండా గదుల కేటాయింపులో జాబితా సిద్ధం చేస్తూ ఈవో ఆదేశాలిచ్చారు. అయితే గదులు కేటాయించకపోవడం, తీవ్ర జాప్యంతో భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీనిపై ఫిర్యాదు అందడంతో చర్యలు తీసుకున్నారు.

● ఆన్‌లైన్‌లో సీనియార్టీ జాబితా

మసీదు సెంటర్ (కాకినాడ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తున్న గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీల తాత్కాలిక సీనియారిటీ జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరిచామని జిల్లా డీఎంహెచ్‌వో డా.నరసింహానాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సోమవారం సాయంత్రం 4 గంటల్లోగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో తెలియజేయాలన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీపై తెదేపా గురి

- అభ్యర్థిగా రాజశేఖర్ పేరు ప్రకటన
- మొదలైన ఎన్నికల సందడి

కాకినాడ కలెక్టరేట్, ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమి అభ్యర్థిని ప్రకటించడంతో కూటమి శ్రేణుల్లో సందడి మొదలయ్యింది. 2025, మార్చిలో జరగనున్న ఈ ఎన్నికలకు కూటమి అభ్యర్థిగా బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం వేమవరానికి చెందిన పేరాబత్తుల రాజశేఖర్ పేరును తెదేపా అధినేత నారా చంద్రబాబు ఖరారు చేశారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలిపి, విజయం సాధించేందుకు కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో కొద్ది రోజులుగా సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఈసారి ప్రధాన రాజకీయ పార్టీలు బరిలో నిలిచే అవకాశం ఉండటంతో ఓటు నమోదు ఊపందుకుంది.

ఇదీ నేపథ్యం పేరాబత్తుల రాజశేఖర్ ఆది నుంచీ తెదేపాలో కొనసాగుతున్నారు. ఎంపీటీసీ సభ్యుడిగా, ఎంపీపీగా, జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు. ఉమ్మడి జిల్లా జడ్పీ ఛైర్మన్ పదవి ఆయనకు త్రుటిలో తప్పింది. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ గ్రామీణ నియోజకవర్గం నుంచి తెదేపా టికెట్ ఆశించినా పొత్తుల్లో భాగంగా కుదర్లేదు.

నాడు 46 మంది బరిలో..

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ప్రస్తుతం ఇళ్ల వెంకటేశ్వరరావు(పీడీఎఫ్) ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2019 నాటి ఎన్నికల్లో 46 మంది పోటీలో నిలిచారు. మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే ఇళ్ల విజయం సాధించారు. పీడీఎఫ్ నుంచి ఈసారి ఇంకా అభ్యర్థి పేరు ప్రకటించలేదు. మరికొందరు స్వతంత్రంగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

■ విధేయతకే పట్టం

- పేరు: పేరాబత్తుల రాజశేఖర్
- వయసు: 51
- తల్లిదండ్రులు: ఆది పటాభి రామయ్య, బాపిరత్నం
- విద్యార్హత: బీఏ
- కుటుంబం: భార్య సత్యవాణి, ఇద్దరు కుమారులు
- వృత్తి: ఆక్వా వ్యాపారం



తెదేపా అధినేత చంద్రబాబుతో రాజశేఖర్

పట్టభద్రుల సంఖ్య ఎక్కువే..

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. 2019లో జరిగిన ఎన్నికల్లో 2,93,794 మందికి ఓటు హక్కు ఉంది. ఉమ్మడి తూర్పు గోదావరిలో 1,72,415, ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 1,21,379 మంది ఓటర్లు అప్పట్లో ఉన్నారు.

● యువత అవకాశాల కల్పనకు కృషి

నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేసిన అధినేత చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆయనను అభ్యర్థిగా ఖరారు చేయడంతో కాకినాడలోని ఆయన నివాసంలో పలువురు కూటమి నాయకులు అభినందించారు. తునిలో తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, ఇతర నాయకులను కలిసిన రాజశేఖర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

■ పేరాబత్తుల పదవులు..

- 1996లో జి.వేమవరం ఎంపీటీసీ సభ్యుడిగా ఎన్నిక(కాంగ్రెస్)
- 2001-05 జిల్లా తెలుగు యువత కమిటీ సభ్యుడు
- 2006-11 ఐ.పోలవరం ఎంపీపీగా ఎన్నిక
- 2012-14 జిల్లా తెలుగు యువత కార్యదర్శి
- 2014-19 ఐ.పోలవరం జడ్పీటీసీగా ఎన్నిక.
- 2020-21 అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ప్రధాన కార్యదర్శి
- 2021-24 కాకినాడ గ్రామీణ నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి
- 2021-23 కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడి నియామకం
- 2023 నుంచి తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా, చంద్రబాబునాయుడి కార్యక్రమాల సమన్వయకర్తగా కొనసాగుతున్నారు.

మహిళా వికాసానికి ఉల్లాస్



కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా మహిళలు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

వనితల్లో అక్షరాస్యతకు కార్యాచరణ

నిరక్షరాస్యత, అవగాహనలేమి కారణంగా వివిధ పథకాల్లో లబ్ధిదారులు మోసాలకు గురవుతున్నారు. దీంతో మహిళల్లో ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రం సాయంతో ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ)ను నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధమైంది.

ఎంపికైన మండలాలు

ఆలమూరు, కపిలేశ్వరపురం, కాట్రేనికోన, ఆత్రేయపురం, రావులపాలెం, రాయవరం, ఐ.పోలవరం, కె.గంగవరం, మండపేట మండలాలను ఎంపిక చేశారు. ఒక్కొక్క మండలం నుంచి 792 మందిని ఎంపిక చేశారు. 10 మంది సభ్యులకు ఒక వాలంటీరు ఉండేలా చూస్తున్నారు.

25 నుంచి శిక్షణ..

ఈ నెల 25 నుంచి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. వయోజనవిద్య, డీఆర్‌డీఏ నుంచి ఇద్దరు చొప్పున అధికారులు మండలాలకు వెళ్లి అవగాహన కల్పించనున్నారు. ఎంపీడీవో, ఏపీఎంలకు, వాలంటీర్లకు తరగతులుంటాయి. అనంతరం క్షేత్ర స్థాయిలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. 2027 వరకు విడతల వారీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

ఇలా గుర్తిస్తారు.. పొదుపు సంఘాల మహిళలు, పాఠశాలల్లో పనిచేస్తున్న సహాయకులు, వంటవారు, కాపలాదారులు, ఆయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల్లో నిరక్షరాస్యులను గుర్తిస్తారు. వీరికి బోధించేందుకు వయోజన విద్య ద్వారా పుస్తకాలు అందజేస్తారు. టీసీఎస్ సహకారంతో డిజిటల్, ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించిన వీడియోల ప్రదర్శించి అవగాహన కల్పించనున్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

మహిళా అక్షరాస్యతే లక్ష్యం



మహిళల్లో అక్షరాస్యతను పెంపొందించడమే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమం ప్రవేశ పెట్టారు. మొదటి విడతలో 9 మండలాలను ఎంపిక చేశాం. ఆరు నెలల కాలంలో 200 గంటల పాటు శిక్షణ ఇచ్చే విధంగా కార్యాచరణ రూపొందించాం.

- జి.విజయ్ భాస్కర్, వయోజన విద్య నోడల్ అధికారి

ఉసురుతీసిన విద్యుత్తు తీగ



మృతులు విశ్వేష్, పద్మ(పాతచిత్రం)

24 గంటల వ్యవధిలో తల్లి, కుమారుడు మృతి

సామర్లకోట: విద్యుత్తు తీగ యమపాశమైంది. రోజు వ్యవధిలో తల్లి, కుమారుడిని బలి తీసుకుంది. శనివారం తల్లి మృతి చెందగా.. ఆదివారం కుమారుడు ప్రాణాలు కోల్పోయిన హృదయ విదారక ఘటన సామర్లకోటలోని వీరరాఘవపురంలో చోటుచేసుకుంది. గ్రామంలోని నీలమ్మచెరువు వద్ద నివసించే చిట్టిమాని కామరాజు, పద్మ (43) దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కొడుకు విశ్వేష్(23) ఉన్నారు. పద్మ ఇళ్లలో పనులు చేస్తుండగా.. విశ్వేష్ పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. శనివారం ఇంటి వద్ద కొళాయి సమీపంలో దుస్తులు ఉతికి వాటిని ఆరేయడానికి వెళ్లిన పద్మ విద్యుదాఘాతంతో కాలువలో పడి మృతిచెందారు. ఆమె ప్రమాదవశాత్తు కాలువలో పడి ప్రాణాలు కోల్పోయిందని కుటుంబ సభ్యులు భావించారు. తల్లి మృతితో దుఃఖంతో ఉన్న విశ్వేష్‌కు ఆదివారం బంధువులు అల్పాహారం అందించారు. తిని చేయి కడగడానికి కొళాయి వద్దకు వెళ్లిన ఆయన వేలాడుతున్న విద్యుత్తు తీగ తగిలి షాక్‌తో కిందపడిపోయాడు. తల్లి మృతిచెందిన చోటే ఆయన కూడా పడిపోవడంతో కుటుంబ సభ్యులు పరిసరాలను గమనించగా విద్యుత్తు తీగ కనిపించింది. తక్షణం అధికారులకు సమాచారం ఇవ్వగా వారొచ్చి సరఫరా నిలిపివేశారు. విశ్వేష్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. 24 గంటల వ్యవధిలో తల్లీబిడ్డ మృతిచెందడంతో కుటుంబీకులు దుఃఖసంద్రంలో మునిగిపోయారు.

విద్యుత్తు శాఖ నిర్లక్ష్యమే..

ఇటీవల వినాయక చవితి సందర్భంగా ఊరేగింపునకు కామరాజు ఇంటి నుంచి విద్యుత్తు సరఫరా తీసుకున్నారు. ఆ సమయంలో సర్వీసు వైరుకు ఆధారంగా వేసిన జీఐ తీగ తెగిపోగా అడ్డుగా ఉందని సమీపంలోని చిన్నచెట్టుకు చుట్టేశారు. ఆ వైరుకు విద్యుత్తు సరఫరా జరిగి ఇద్దరిని బలితీసుకుందని, విద్యుత్తు శాఖ అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

26 నుంచి అప్పనపల్లిలో పవిత్రోత్సవాలు



బాలబాలాజీస్వామి

మామిడికుదురు, న్యూస్‌టుడే: వైనతేయ నదీ తీరంలోని మామిడికుదురు మండలం అప్పనపల్లిలో కొలువైన బాల బాలాజీస్వామికి ఈ నెల 26 నుంచి 28 వరకు పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 26న విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, నవకలశ స్నపన, 27న చతుస్థానార్చనలు, అగ్నిప్రతిష్ఠాపన, 27 కలశాలతో తిరుమంజనం, ప్రాయశ్చిత్త హోమం, 28న పవిత్ర అవరోహణం, మహా పూర్ణాహుతి, శ్రీవారికి ఏకాదశ ఫలరస స్నపన సంహిత అష్టోత్తర శతకలశ స్నపన తిరుమంజనం అనంతరం స్వామివారికి శాంతి కల్యాణోత్సవం, శ్రీపుష్పయాగం జరపనున్నారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏసీ ఎం.సత్యనారాయణరాజు ఆదివారం తెలిపారు.

అపార్‌లో 9,551 మంది నమోదు

జిల్లాలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

ముమ్మిడివరం: వన్ నేషన్-వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ఆధార్ తరహాలో అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు జిల్లాలో కొనసాగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కేజీ నుంచి పీజీ వరకు ప్రతి విద్యార్థికి గుర్తింపు సంఖ్య కేటాయించి అపార్ కార్డులు అందజేయనున్నారు. ఇందులో భాగంగా కేంద్ర విద్యాశాఖ ప్రయోగాత్మకంగా 9-10 విద్యార్థులకు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇప్పటి వరకు 9,551 మంది వివరాలు నమోదు చేశారు.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులు

ప్రాథమిక పాఠశాలలు	1,396
ప్రాథమికోన్నత	234
ఉన్నత	405
1-8 విద్యార్థులు	1,49,694
9,10 తరగతులు	39,368
ఇంటర్మీడియట్	24,135
ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్	9,551

ప్రక్రియ వేగంగా జరుగుతోంది

వన్ నేషన్-వన్ స్టూడెంట్ నినాదంతో కేంద్ర ప్రభుత్వ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అపార్ కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లాలో వేగంగా జరుగుతోంది. తొలుత 9-10 తరగతుల విద్యార్థులకు ఆయా పాఠశాలల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. 9-10 తరగతుల విద్యార్థులు 39వేల మంది ఉండగా.. ఇప్పటి వరకు 9,551 మందికి రిజిస్ట్రేషన్ జరిగింది.

-ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి

ఆపద సమయంలో అరచేతిలో ప్రాణాలు



న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

జిల్లాలో జాతీయ రహదారులపై సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులు అత్యవసర వైద్యం అందక ఏటా వందల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల బాధితులు అత్యవసర వైద్యం కొరకు సమీపంలో ఉన్న పట్టణాలకు రావాల్సి ఉంటుంది. ఈక్రమంలో మార్గ మధ్యలోనే విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రాత్రి సమయాల్లో ప్రమాదం సంభవిస్తే క్షతగాత్రులకు తక్షణం వైద్యం గగనంగా మారుతోంది. కొన్నిసార్లు చిన్న ప్రమాదాల్లో ప్రాణాపాయ స్థితి ఏర్పడుతోంది. హెచ్‌కు, అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలిస్తున్నారు. వైద్యభాషలో గోల్డెన్ అవర్‌గా పరిగణించే అత్యవసర సమయంలో చికిత్స అందక ప్రాణాలు పోతున్నాయి. జిల్లాలో ఎక్కువగా తాళ్లరేవు, ముమ్మిడివరం, బాలయోగి వారధి, బోడసకుర్రు ప్రాంతాల్లో రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ముమ్మిడివరం, రాజోలు ప్రాంతాల్లో రెండుచోట్ల ట్రామాకేర్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ప్రమాదాల సమయంలో మృతుల సంఖ్య తగ్గించే అవకాశం ఉంటుంది.

జిల్లాలో ఇలా..

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 216 నంబరు జాతీయ రహదారి సుమారు 95 కి.మీ. మేర ఉంది. తాళ్లరేవు మండలం వద్ద ప్రారంభమై సఖినేటిపల్లి మండలం గోదావరి రేవు వద్ద ముగుస్తుంది. జాతీయ రహదారి ముమ్మిడివరం, అమలాపురం, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. నిత్యం వేల మంది ప్రయాణిస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒంగోలు నుంచి కత్తిపూడి వరకు విస్తరిస్తున్న బైపాస్ రోడ్డు పలు చోట్ల 216 జాతీయ రహదారిలో కలుస్తుంది.

✦ సంవత్సరం	■ ప్రమాదాలు	● మృతులు	▲ క్షతగాత్రులు
2022	320	206	135
2023	318	213	141

అప్పట్లో ప్రతిపాదనలకే పరిమితం

వైకాపా పాలనలో ముమ్మిడివరం సమీపంలో ట్రామాకేర్‌కు ప్రతిపాదనలు పెట్టినా అప్పటి నాయకుల అలసత్వం వల్ల కార్యరూపం దాల్చలేదు. ప్రమాద సమయాల్లో క్షతగాత్రులను కాకినాడ జీజీ

కేంద్రం దృష్టికి తీసుకెళ్తా

జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందించడానికి జిల్లాకు ట్రామాకేర్ సెంటర్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరతా. 216 జాతీయ రహదారిపై డ్రైవర్లకు విశ్రాంతి కేంద్రాలు నిర్మించాల్సిన అవసరాన్ని మంత్రికి వివరిస్తా.

-గంటి హరీష్, ఎంపీ, అమలాపురం

ప్రాణాలు నిలిచే అవకాశం

జాతీయ రహదారిపై ప్రమాదం జరిగినప్పుడు ప్రధానంగా ఎముకలు విరుగుతుంటాయి. రక్తనాళాలు, నాడీ కణాలు తెగిపోతాయి. అవయువాల్లో నేరుగా రక్త స్రావం జరిగి క్షతగాత్రులు మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ఆయా విభాగాల వైద్య నిపుణులను ఒకచోట చేర్చి అత్యవసర సేవలు అందించడమే ట్రామాకేర్ వైద్యం. ఈ కేంద్రాల్లో ఆర్థోపెడిక్ సర్జన్, అనస్థీషియా, అత్యవసర వైద్యసేవ నిపుణుడు, న్యూరో, వాస్క్యులర్ సర్జన్లు అందుబాటులో ఉంటారు. రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేస్తారు.


అక్విడక్టు నిర్వహణ పనులకు నిధులలేమి



అక్విడక్టుపై వెలగని విద్యుత్తు దీపాలు

పి.గన్నవరం: వైనతేయ గోదావరి నదీపాయపై పి.గన్నవరం వద్ద ఉన్న డొక్కాసీతమ్మ అక్విడక్టు నిర్వహణ పనులకు నిధులు లేని దుస్థితి ఏర్పడింది. రాజోలు దీవికి అత్యంత కీలకమైన ఈ కట్టడం విషయంలో ఆదినుంచీ నిర్వహణ పనులకు నిధులు విడుదల చేయకపోవటంతో రహదారి గుంతలు పడి మరమ్మతులు చేసేందుకు వీలుకాని పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్తు దీపాలు వెలగకపోవడంతో అంధకారంలో మగ్గుతోంది. రోడ్డు పొడవునా గుంతలు పడి వాహనాల రాకపోకల సమయంలో వాటిలో పడటంతో అక్విడక్టుపై ఒత్తిడి పెరుగుతోంది. వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పుష్కరకాలం క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలకు బిల్లులు చెల్లించకపోవడం, మరమ్మతుకు రావడంతో అవికూడా వెలగడం లేదు. సుమారు రెండు సంవత్సరాలుగా ఉన్నతాధికారులు నిధులు విడుదలకు సిఫార్సు చేస్తామంటూ చెబుతున్న మాటలు కార్యరూపంలోకి రావడంలేదు. రహదారి మరమ్మతులకు రూ.54 లక్షలు, విద్యుత్తు దీపాలకు రూ.34 లక్షలు అవసరం ఉంటుందని స్థానిక జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు నాలుగు నెలల క్రితం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. అవికూడా విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో పనులు చేసేందుకు వీలుపడటం లేదు. ఫలితంగా రహదారి మరింత దెబ్బతింటుంది. దీనిపై 'న్యూస్‌టుడే' డీఈఈ నాగేంద్ర కుమార్‌ను సంప్రదించగా నిధులు విడుదలైతే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

అలల మోత.. తీరం కోత



ఓఎన్జీసీ ప్లాంట్ వద్ద కోతకు గురైన తీరం



ఓడలరేవు వైపునకు దూసుకెళ్తున్న అలలు

అల్లవరం మండలం ఓడలరేవు వద్ద సముద్రం కొన్నాళ్లుగా ముందుకు చొచ్చుకు వస్తూ తీరాన్ని కోతకు గురిచేస్తోంది. గత వారంలో తుపాను ప్రభావంతో కెరటాలు ఎగసి పడ్డాయి. ఓఎన్జీసీ ప్లాంట్ చుట్టూ వేసిన బీటీ రహదారి సముద్రంలోకి కొట్టుకుపోయింది. ప్లాంట్ వెనుక నుంచి సముద్రం గ్రామం వైపు దూసుకు వస్తోంది. అధికారులు స్పందించి తీరం కోతకు రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, అల్లవరం

స్వర్ణాంధ్ర కల సాధనకు కృషి



బాలాంత్రంలో సీసీ రోడ్డుకు మంత్రి భూమిపూజ

పామర్రు: రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ప్రస్తుతం రూ.6.70కోట్ల నిధులతో సిమెంటు రోడ్లు వేసే పనులు మొదలు పెట్టామని రెండు నెలల్లో ఇవన్నీ పూర్తవుతాయని మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా కె.గంగవరం మండలం బాలాంత్రం గ్రామంలో రూ.31లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా రూపొందించడానికి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి అహోరాత్రులు శ్రమిస్తున్నారన్నారు. సువర్ణ రామచంద్రపురంగా తీర్చిదిద్దుతానన్నారు. ఎంపీడీవో ఎన్.శ్రీనివాసు, సర్పంచి చాగంటి సాంబశివరావు పాల్గొన్నారు. కుందూరు గ్రామంలో ఎంపీపీ పంపన నాగమణి సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. సర్పంచి సత్యానందం, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



లైకుల మోజు.. కెరటంతో పోజు

ఫొటోలు, రీల్స్ మోజులో పడి కొందరు యువత ప్రమాదకర స్థితిలో ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఆదివారం అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరంలో కొందరు యువకులు అలల పక్కన రాళ్లపై నిలబడి ప్రమాదకర స్థితితో ఫొటోలు తీసుకుంటూ కనింపించారు. ఇటీవల ఇక్కడ సముద్రపు అలలు ముందుకు చొచ్చుకువచ్చి తీరం ప్రమాదకరంగా ఉంది. కాలు జారితే సముద్రంలో గల్లంతయ్యే ప్రమాదం ఉంది.

-న్యూస్‌టుడే, అల్లవరం

పోటునీరు ముంచెత్తి పాట్లు

సఖినేటిపల్లి మండలం పల్లిపాలేన్ని గత నాలుగు రోజులుగా అర్ధరాత్రి వేళ సముద్రం, గోదావరి పోటునీరు ముంచెత్తుతోంది. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి రక్షణగా ఉండే గ్రోయిన్స్ కిందకు జారిపోవడం, ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఈ పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఉప్పునీటికి ఇళ్లు, రోడ్లు పాడైపోతున్నాయని, అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సఖినేటిపల్లి



ఎమ్మెల్యే సారు.. భలే జోరు



పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మామిడికుదురు మండలం గెద్దాడలో ఆదివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనకు వినూత్నంగా గుర్రంబండిపై ఎక్కించి స్వాగతం పలికారు. ఆ సమయంలో కొద్దిసేపు ఎమ్మెల్యే ఇలా బండి నడిపి అక్కడున్న వారిని ఉత్సాహపరిచారు.

- న్యూస్‌టుడే, మామిడికుందురు

జలజల.. గలగల

ప్రత్తిపాడు మండలంలోని ఎరకంపాలెం ఉప ప్రణాళిక మన్యం తూర్పు కనుమల్లోని జలపాతం చూపరులను ఆకట్టుకుంటోంది. కొండల నుంచి వచ్చే ఊటనీరు ఏడాది పొడవునా ప్రవహిస్తుంది. వర్షాకాలంలో మరింత రమణీయంగా కనువిందు చేస్తుంది. సముద్ర మట్టం నుంచి 1,700 మీటర్ల ఎత్తులో ఉండే ఈ జలపాతం కనువిందు చేస్తుంది. సెలవురోజులు కావడంతో అందాలను చూసేందుకు పర్యాటకులు పెద్దఎత్తున వస్తుంటారు.

- ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, ప్రత్తిపాడు



పిచ్చుకగూళ్లు.. చూస్తేనే తెరుచుకుంటాయి నోళ్లు..

న్యూస్‌టుడే, మామిడికుదురు

కోనసీమ అంటే ఆహ్లాదకరమైన పచ్చదనానికే కాదు.. ఆదరణకూ రుచులకూ చిరునామా.. ఇక్కడ పసందైన పిచ్చుకగూళ్లను కరకరలాడిస్తూ ఆరగించేస్తారు. ఇదేంటి.. చిత్రంగా పిచ్చుక గూళ్లను తినడమేమిటని అనుకోకండి..! తీయగా ఉండే గ్రజాలనే వంటకాన్ని ఇక్కడి వాళ్లంతా దాని ఆకారాన్ని బట్టి పిచ్చుకగూళ్లు అని పిలుస్తుంటారు. విచిత్రం అనిపించే పేరుతో పాటు దీని కథాకమామీషును తెలుసుకుందాం..!



నోరూరించే గ్రజాలు

216 జాతీయ రహదారి చెంత..

నగరం నుంచి మామిడికుదురు వరకు 216 జాతీయ రహదారికి ఇరువైపులా దాదాపు 70 వరకు గ్రజాలు తయారు చేసే దుకాణాలు విస్తరించాయి. రహదారి చెంతనే వీటిని వండుతూ విక్రయాలు చేస్తున్నారు. ప్రయాణికులు, వాహన చోదకులు వీటిని ఆసక్తిగా తిలకించడంతో ఆగకుండా ఆగి మరీ రుచి చూసి తీసుకువెళ్తున్నారు. ఆర్డర్లపై మరీ వీటిని చక్కగా కానుకగా పంపిస్తున్నారు.

తయారు చేసేదిలా..

నానబెట్టిన బియ్యాన్ని యంత్రం లేక ఉరుకొట్టిన రోళ్లతో పిండిగా చేసి పాకం పట్టిన బెల్లం లేదా పంచదారను అందులో కలిపి దారాలు పోశంలా చేస్తారు. బాగా కాగిన నూనెలో రంధ్రాలున్న నిలువు చట్రం ద్వారా పిండిని తిప్పుతూ అందులో గుండ్రంగా పోస్తారు. కాసేపు వేగిన తర్వాత దానిని అర్ధ చంద్రాకారంలో మడిచి బొరా వేసే వరకు ఉంచుతారు. కొందరు నూనెకు బదులుగా నెయ్యి ఉపయోగిస్తారు. బెల్లం, పంచదారలో కాకుండా తేనెతో తయారు చేయించుకుంటారు. 30 నుంచి 40 గ్రాముల వరకు బరువుండే ఒక్కో గ్రజాల్ రూ.10 నుంచి రూ.12కు విక్రయిస్తున్నారు. గాలి తగలని డబ్బాల్లో వీటిని జాగ్రత్త చేసుకుంటే దాదాపు మూడు వారాల వరకు నిల్వ ఉంటాయి.



తీపి గ్రజాలు తయారీలో మహిళ

ఇక్కడికిలా వచ్చి చేరింది..

దాదాపు మూడున్నర శతాబ్దాల క్రితం ఉపాధి రీత్యా బర్మా వెళ్లిన మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని కొందరు ముస్లింలు అక్కడి వంటకాన్ని ఇక్కడికి తీసుకువచ్చారు. అది క్రమేణా వారి శుభకార్యక్రమాల్లో ఓ సంప్రదాయ మిఠాయిగా నిలిచింది. అలా స్థానికంగా నగరం, మామిడికుదురులోనే దాదాపు 200 కుటుంబాల వారికి ఉపాధిగా మారింది. కోనసీమ మీదుగా ఉన్న 216 జాతీయ రహదారి వల్ల బాహ్య ప్రపంచంతో వీటికి బంధం మరింత ఏర్పడింది. దీంతో ఉభయ గోదావరి జిల్లాల్లో పలు చోట్ల వీటి విక్రయాలు పెరిగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో సహా యూఎస్‌ఏ, గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు వీటిని ప్రత్యేకంగా అట్టపెట్టెల్లో భద్రపరచి తీసుకువెళ్తున్నారు.

దాత ఔదార్యం.. ఫలించిన ప్రయోగం

పెద్దమనసు చాటుకున్న ఆర్బీఐ పూర్వ సీజీఎం రామశాస్త్రి

న్యూస్‌టుడే, పెద్దాపురం

విద్యార్థి దశలో పాఠ్యాంశాలను కేవలం మనసులో నిక్షిప్తం చేసుకోవడానికి ప్రయోగాలు ఎంతో దోహదం చేస్తాయి. ప్రయోగాత్మకంగా పాఠాలు వివరిస్తే సత్ఫలితాలను విద్యార్థుల మెదడులోకి చొప్పిస్తూ వారు మరచిపోకుండా ఉండేలా సాయపడతాయి. సైన్స్ పాఠాలు చదువుకుంటూ, ప్రయోగాలు చేయడం ద్వారా చక్కగా అర్థమవుతుందని భావించిన భారత రిజర్వు బ్యాంకు పూర్వ చీఫ్ జనరల్ మేనేజర్ అల్లూరి రామశాస్త్రి. పెద్దాపురం పట్టణంలో అల్లూరి చారిటబుల్ ట్రస్టు (క్రియ, కాకినాడ సహకారంతో) మేథో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేశారు. రామారావుపేటలో 2023 సంవత్సరంలో రూ.15 లక్షల వ్యయంతో కేంద్రాన్ని ప్రారంభించారు. ఇందులో భౌతిక, రసాయన, జీవశాస్త్ర విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రయోగశాలలను ఏర్పాటుచేశారు. కేంద్రంలో మండలంలోని గోనెడ ప్రభుత్వ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు బుద్దాల శ్రీనివాస్ పర్యవేక్షణ తెలుసుకుని రామశాస్త్రి ఆయనకు కేంద్ర నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. పెద్దాపురం పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ కేంద్రంలోనే ప్రయోగ పాఠాలు అభ్యసిస్తున్నారు. రోజూ జిల్లా నలుమూలల నుంచి 40 మంది వరకు విద్యార్థులు ప్రయోగాలు చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు ఆరు వేల మంది 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు ప్రయోగాల ద్వారా పాఠాలు నేర్చుకున్నారు.



కేంద్రంలో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు



జీవశాస్త్ర ప్రయోగాలకు నమూనాలు

బట్టీపడితే సైన్స్ రాదు..

సైన్స్ పాఠ్యాంశాలు బట్టీపడితే రావు. ప్రయోగాల ద్వారా పాఠం పూర్తిగా అర్థమవుతుంది. రోజూ జిల్లా నలుమూలల నుంచి వచ్చే విద్యార్థులకు వారి ఉపాధ్యాయుల సూచన మేరకు ప్రయోగ పాఠాలు బోధిస్తాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకంగా ప్రయోగాల ద్వారా సైన్స్ బోధించే కేంద్రం ఇదొక్కటే.

- బుద్దాల శ్రీనివాసు, కేంద్రం నిర్వాహకుడు

ఎమ్మెల్సీ ఎన్నికలో విజయానికి కృషి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ సూచించిన అభ్యర్థి విజయానికి కూటమి నాయకులు కృషి చేయాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సూచించారు. మండలంలోని తేటగుంట పార్టీ కార్యాలయంలో ఎన్డీఏ కూటమి నాయకులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఓటు నమోదు, వినియోగంపై అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. యువతకు కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. పార్టీ పేరుతో ఆరాచకాలకు అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించబోమని యనమల స్పష్టం చేశారు. కూటమి నాయకులు ప్రజాసేవలో బాధ్యతయుతంగా ప్రవర్తించాలన్నారు. ఉచిత ఇసుక, మద్యం విధానంలో నాయకులు తలదూర్చకూడదని సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పి.రాజశేఖర్, కుసుమంచి శోభారాణి, యనమల రాజేష్, సుర్ల లోవరాజు నియోజకవర్గంలో మూడు మండలాలు, పట్టణప్రాంతానికి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యనమల, పార్టీ నాయకులు

5 గంటలు ఆలస్యంగా గౌతమి ఎక్స్‌ప్రెస్

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: లింగంపల్లి నుంచి కాకినాడ పోర్టుకు రావాల్సిన గౌతమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు 5 గంటలకు పైగా ఆలస్యంగా వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం 12.11 నిమిషాలకు కాకినాడకు చేరుకుంది. సాధారణంగా ఈ రైలు లింగంపల్లి నుంచి రాత్రి 8.30 బయల్దేరి సికింద్రాబాద్ స్టేషన్ నుంచి 9.10 నిమిషాలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.15కు బయల్దేరి 6.58కు కాకినాడకు చేరుకుంటుంది. 19వ తేదీ రాత్రి 9.15 నిమిషాలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరాల్సిన రైలు అర్ధరాత్రి దాటక 2.32 నిమిషాలకు బయల్దేరింది. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలు పడ్డారు. రైలు ఇంజిన్‌లో సాంకేతిక లోపం కారణంగా ఆలస్యమైనట్లు రైల్వే వర్గాల సమాచారం.

సాగునీటి విడుదల

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 6,800 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు 1300, 1500, 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాటన్ బ్యారేజీ వద్ద 10.90 అడుగుల నీటిమట్టం కొనసాగుతోందన్నారు. 27,154 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ): జాతీయస్థాయి ఎంపికైన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పేరు తీసుకు రావాలని కాకినాడ డీఎస్పీ డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాకినాడలో జరుగుతున్న అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ ఆదివారంతో ముగిసింది. అండర్-11, 14, 17, 19 విభాగాల్లో క్వాడ్, ఇన్‌లైన్ అంశాల్లో రోడ్డు, రింక్‌ల్లో పోటీలు నిర్వహించామని ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. అండర్-11, 14, 17, 19 విభాగాల్లోని క్వాడ్ విభాగంలో 24 మంది, ఇన్‌లైన్ విభాగంలో 24 మంది కలిపి 48 మంది జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. నవంబర్ 2వ వారంలో దిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. డీఎస్‌డీవో, హరీష్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తలాటం హరీష్, టోర్నమెంట్ పరిశీలకులు ఎస్.దిలీప్‌కుమార్, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజగోపాల్, దొరస్వామిరాజు, కోశాధికారి సీహెచ్ రమేష్ విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వి.రవిరాజు, కె.నూకరాజు, కోశాధికారి కౌర్, ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 జిల్లా అసిస్టెంట్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయికి అర్హత సాధించిన క్రీడాకారులతో అతిథులు

కబడ్డీ ఛాంపియన్ కాకినాడ ఐడియల్ కళాశాల

మండపేట, న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర కళాశాలల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలతో పాటు, సౌత్ జోన్ కబడ్డీ జట్టు ఎంపిక ప్రక్రియ రెండు రోజుల పాటు మండపేట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. ఈ పోటీలకు ఉభయగోదావరి జిల్లాల నుంచి సుమారు 250 మంది పాల్గొన్నారు. ఛాంపియన్‌షిప్ పోటీలకు 16 జట్లు పోటీ పడగా అంతర కళాశాల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలో కాకినాడ ఐడియల్ కళాశాల ప్రథమ స్థానంలో నిలవగా కాకినాడ పీఆర్ కళాశాల ద్వితీయ స్థానం, మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. అదే విధంగా మొత్తం అన్ని టీముల నుంచి మెరుగైన క్రీడా నైపుణ్యం కనబరచిన 16 మంది క్రీడా కారులను నన్నయ యూనివర్సిటీ తరపున ఎంపిక చేశారు. వీరందరూ ఈనెల 30వ తేదీన చెన్నై ఎస్ఆర్ఎం కళాశాలలో నిర్వహించే సౌత్‌జోన్ అంతర కళాశాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎ.ఆనందరావు, వ్యాయామ అధ్యాపకుడు ఎన్.వీరాంజనేయులు, అధ్యాపకులు దిలీప్, రాజేష్ తదిరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.



సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన వివిధ కళాశాలల క్రీడాకారులు

ప్రతిభ చాటిన నాగ శ్రీరామరాజు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ప్రతిష్ఠాత్మకమైన 2024 - 19వ ఎడిషన్ వేదాంత దిల్లీ హాఫ్ మారథాన్‌లో మండలంలోని లొల్ల గ్రామానికి చెందిన మాజీ సైనికుడు దాట్ల నాగ శ్రీరామరాజు తన ప్రతిభను చాటాడు. ఆదివారం దిల్లీలో జరిగిన కార్యక్రమంలో 40-44 సంవత్సరాల విభాగంలో 36వేలమంది పాల్గొన్న 21.1 కి.మీ పరుగుని 1 గంట 31 నిమిషాల్లో పూర్తి చేసి భారత దేశంలో 34వ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.



ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):		11,500
పాతకాయ:	గండేరా	17,500
	గటగట	15,500
కొత్తకాయ:	గండేరా	16,500
	గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):		
పాత (ముక్కుడు) కాయ		13,000-13,500
కొత్త (పచ్చి) కాయ		12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:		
15 కిలోలు		3,750
కిలో		260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

ఆధార్ సరిచూశాకనే వసతి గది కేటాయింపు


అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో భక్తులకు వసతి గదుల కేటాయింపులో అవకతవకలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టారు. గది పొందే భక్తుడి ఆధార్‌ను సరిపోల్చిన తర్వాతే కేటాయించాలని ఈవో కె.రామచంద్ర మోహన్ ఆదేశాలిచ్చారు. సీఆర్వో (సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం)లో గదిని కేటాయించే సమయంలో భక్తుల ఆధార్‌కార్డు, ఫోను నంబరు వివరాలను కంప్యూటర్ రసీదుపై నమోదు చేయాలని సూచించారు. రసీదు తీసుకుని వసతి సముదాయం వద్దకు వెళ్లినప్పుడు అక్కడ విధుల్లో ఉండే గుమస్తా రసీదులో వివరాల ప్రకారం ఆధార్ కార్డును పరిశీలించి వివరాలు నమోదు చేసి గది తాళాలు అందించాలని ఆదేశించారు. గదిని ఖాళీ చేసిన తర్వాత సామగ్రి అంతా సరిగ్గా ఉందని ధ్రువీకరించి రసీదుపై నమోదు చేసి ఇవ్వాలన్నారు. అడ్వాన్సు రుసుం భక్తుడికి తిరిగి ఇచ్చేందుకు సీఆర్వో వద్ద ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ కలెక్టరేట్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నవంబరు 11న మైనార్టీ సంక్షేమం, జాతీయ విద్యా దినోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుందని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఎం.సునీల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్యం, విభిన్న రంగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారం కింద రూ.1.25లక్షలు, ధ్రువపత్రం, జ్ఞాపిక, డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారం కింద రూ.లక్ష ప్రోత్సాహకం, ధ్రువపత్రం, జ్ఞాపిక అందజేస్తారని తెలిపారు. ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అయిదేళ్ల బోధనా అనుభవం ఉండాలన్నారు. ఉర్దూ అకాడమీ జారీ చేసిన దరఖాస్తును పూరించి, ఆయా విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, రిజిస్ట్రార్ల ద్వారా ప్రమాణ ప్రతులను విజయవాడలోని ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీకి అందజేయాలన్నారు.

జాతీయస్థాయిలో మెజీషియన్ ప్రతిభ

మామిడికుదురు, న్యూస్‌టుడే: మామిడికుదురు మండలం నగరానికి చెందిన మెజీషియన్ అలీ కేరళలోని కొచ్చిలో మలయాళీ మెజీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఇంద్రజాలోత్సవంలో రూ.లక్ష చెక్కుతో పాటు ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందుకున్నారు. గత మూడున్నర దశాబ్దాలుగా దేశ విదేశాల్లో 7 వేల ఇంద్రజాల ప్రదర్శనలు చేసినందుకు గాను జాతీయ స్థాయిలో ఎంపిక చేసిన ముగ్గురిలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి తనకు ఈ పురస్కారం దక్కిందన్నారు. జాతీయ స్థాయిలో అలీ పురస్కారాన్ని అందుకున్నందున గ్రామంలో పలువురు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.



రూ.లక్ష చెక్కు అందుకుంటున్న మెజీషియన్ అలీ

ఒప్పంద అధ్యాపకుల ఆందోళన

పిఠాపురం, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000 సంవత్సరంలో ఒప్పంద అధ్యాపకులుగా విధుల్లో చేరామని, ఇప్పటికీ తమను రెగ్యులరైజ్(క్రమబద్ధీకరణ) చేయలేదని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ఎస్ శర్మ, జనరల్ కార్యదర్శి బీజేగాంధీ, వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్ వాపోయారు. ఆదివారం పిఠాపురం పురుహూతిక అమ్మవారి ఆలయం వద్ద గణపతి హోమం నిర్వహించి, దత్తాత్రేయస్వామి సన్నిధిలో పొర్లుదండాలతో ప్రభుత్వాన్ని వేడుకున్నారు. రాష్ట్రంలో 400 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,618 మంది పనిచేస్తుండగా, జిల్లాలో 300 మంది ఒప్పంద అధ్యాపకులున్నారన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు రాజకీయ ప్రయోజనం ఆశించి 114 జీవో ఇచ్చి అమలు చేయలేదని ఆరోపించారు.



దత్తాత్రేయ స్వామి సన్నిధిలో పొర్లుదండాలతో నిరసన

కలెక్టరేట్‌లో అర్జీల స్వీకరణ నేడు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జిల్లా కేంద్రం అమలాపురం కలెక్టరేట్‌లో యథావిధిగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల నుంచి కలెక్టర్ నేరుగా అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

గోదావరి కాలువలో నీటి కుక్కలు

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: సామర్లకోటలోని గోదావరి కాలువలో ఆదివారం నీటి కుక్కలు సందడి చేశాయి. వి.కె.రాయపురం-మాధవపట్నం మార్గమధ్యలోని గోదావరిలో మూడు నీటికుక్కలు ముందుకూ.. వెనక్కి నీటిలో ఈదుతూ కనిపించాయి. గోదావరి పరివాహక ప్రాంతాలు, జల వనరులు అధికంగా ఉండే ప్రాంతాల్లో గుంపులుగా ఇవి సంచరిస్తుంటాయి. నీటిలో, నేలపై సంచరించగలిగే అరుదైన ఈ జీవులు చేపలను ఆహారంగా తీసుకుని జీవిస్తాయి.



రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం



అల్లుకున్న నిర్లక్ష్యం

విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలకు పలుచోట్ల తీగ మొక్కలు అల్లుకుని ప్రమాదభరితంగా మారుతున్నాయి. ముక్తేశ్వరం, అమలాపురం ప్రధాన రహదారి సిరిపల్లిలో విద్యుత్తు స్తంభానికి, కొబ్బరిచెట్టుకు పాదులు అల్లుకుని తీగలను తాకుతున్నాయి. స్థానికులు, పశువులు వాటిని తాగితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, అధికారులు పరిశీలించి వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అయినవిల్లి

సీసీ రహదారికి భూమిపూజ

మలికిపురం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సీసీ రహదారి నిర్మాణానికి ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, సర్పంచి డాక్టర్ రాపాక రమేశ్‌బాబు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఓగూరి మనోహర్, చెవ్వాకుల వెంకటరత్నం, మల్లిపూడి సత్తిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో సిద్ధివినాయకుడు

అయినవిల్లి, న్యూస్‌టుడే: సంకటహర చతుర్థి పర్వదినం సందర్భంగా ఆదివారం సిద్ధివినాయకస్వామి ఆలయం కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు, అయ్యప్పస్వాములు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

మామిడికుదురు: పాశర్లపూడిలంక ఏటిబాడవ నుంచి వంతెన సమీపంలోని ఆర్చి వరకు వీధి దీపాలు వెలగడం లేదంటూ స్థానికులు చెప్పిన సమస్యను సర్పంచి సూర్యప్రకాశరావు, కార్యదర్శి సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా వారు వెంటనే స్పందించారు. అక్కడ కొత్తగా ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది.

ఆత్రేయపురం: పేరవరం గ్రామంలో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచి గంటి విజయభారతి వద్ద న్యూస్‌టుడే ప్రస్తావించగా స్పందించి వీధిదీపాలు వేయించారు.

చెత్త తొలగింపు

రావులపాలెం పట్టణం: రావులపాలెంలో శ్రీనివాస్‌నగర్‌లో రోడ్డు వెంతన చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు మేమున్నాం మీకు తోడుగా తీసుకువచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో సిబ్బంది పంపి శుభ్రం చేయించారు.

పరిసరాలు శుభ్రం

అంబాజీపేట: మాచవరం గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో స్థానికులు కొందరు పడుతున్న ఇబ్బందులను 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని సర్పంచి నాగాబత్తుల శాంత కుమారి వద్ద ప్రస్తావించగా ఆయా ప్రాంతాలను శుభ్రం చేయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

వైకాపా నిర్లక్ష్యం.. కూటమి ఆపన్నహస్తం

గృహ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించేందుకు సర్వే

తెదేపా హయాంలో మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఇంటినిర్మాణ ప్రగతిని బట్టి అప్పట్లో కొంతవరకు బిల్లులు చెల్లించారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటి గురించి పట్టించుకున్న పాపానపోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆయా వివరాలు సేకరించేందుకు సర్వే చేపట్టింది. త్వరలో బిల్లులు చెల్లించేందుకు రంగం సిద్ధం చేసింది. పి.నగ్నవరం నియోజకవర్గంలో 4,525 మంది లబ్ధిదారులు ఉన్నట్లు సర్వేలో గుర్తించారు.

- న్యూస్‌టుడే, పి.గన్నవరం

తెదేపా ప్రభుత్వం(2014 నుంచి 2019 మధ్య) ఎన్టీఆర్ ఆర్.పి.హెచ్.(రూరల్ పక్కా హౌసింగ్) కింద యూనిట్ విలువ రూ.1.50 లక్షలతో పక్కాఇళ్లు మంజూరు చేసింది. 2016 నుంచి 2019 వరకు ఏటా ఇలా మంజూరుచేసి నిర్మాణ ప్రగతిని బట్టి చెల్లింపులు చేశారు. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో 2016 నుంచి 2019 వరకు మంజూరు చేసిన పక్కాఇళ్ల నిర్మాణాలకు బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం పక్కన పెట్టేసింది. ఈ బాపతు ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారో గుర్తించమని నెల రోజుల క్రితం కూటమి ప్రభుత్వం హౌసింగ్ అధికారులను ఆదేశించింది. లబ్ధిదారులు, ఇళ్లనిర్మాణ పరిస్థితులను సర్వేచేసి ఫొటోలతో సహా ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. అసలు మొదలు కానివి, పునాదుల దిగువ, పునాదుల స్థాయి, లింటల్, రూఫ్, రూఫ్‌కాస్ట్, పూర్తయిన ఇళ్లు.. ఇలా వివిధ దశల్లో వివరాలు సేకరించి పంపారు. వీటికి బిల్లులు చెల్లించేందుకు బ్యాంకు ఖాతాలు మనుగడలో ఉన్నదీ లేనిదీ తెలుసుకునేందుకు ఒక్క రూపాయి చొప్పున ప్రాథమికంగా బ్యాంకు ఖాతాల్లో జమచేసిన పరిస్థితులు ఉన్నాయి.



లంకలగన్నవరంలో పునాది స్థాయిలో నిలిచిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

పి.గన్నవరం నియోజకవర్గంలో..

పి.గన్నవరం మండలంలో 1116, అంబాజీపేటలో 1156, అయినవిల్లిలో 1131, మామిడికుదురులో 1122 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో పూర్తిగా ఇళ్లు నిర్మించుకున్న వారు 860 మంది ఉన్నారు. మిగిలిన 3,640 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీరందరికీ పక్కాఇళ్లు పూర్తిచేయడంతో పాటు పూర్తి చేసుకున్న వాటికి బిల్లులు చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.

వివరాలు పంపాం

2016-19 వరకు అప్పటి తెదేపా ప్రభుత్వం మంజూరు చేసిన ఎన్టీఆర్ పక్కాహౌసింగ్ స్కీముకు సంబంధించి పూర్తిగా ఇళ్లు నిర్మించుకుని, వివిధ దశల్లో నిర్మాణాలు చేపట్టి, అసలు మొదలు పెట్టని లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వానికి పంపాం. బిల్లులు చెల్లించి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- ధరణాల శ్రీనివాస్, హౌసింగ్ డీఈఈ, పి.గన్నవరం

సంక్షేమ పథకాలతో ప్రయోజనం

మామిడికుదురు, న్యూస్‌టుడే: కేంద్రంలో అధికార భాజపా ప్రజా సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలన్నీ అర్హులకు చేరుతున్నాయని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మామిడికుదురులో ఆదివారం పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తిచేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు మెండా ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గాడి సత్తిబాబు, వేగి వెంకటేశ్వరరావు, తమ్మయ్య నాయుడు, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యలపై చర్చలు విఫలం

మలికిపురం, న్యూస్‌టుడే: జీతాల కోసం గత 40 రోజులుగా రిలే దీక్షలు కొనసాగిస్తున్న ఎమ్వీఎన్, జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సమస్య పరిష్కారానికి డీఎస్పీ సూచనతో రాజోలు సీఐ నరేశ్‌కుమార్, ఎస్సై సురేశ్‌లు పాలకవర్గంతో ఆదివారం జరిపిన చర్చలు విఫలమయ్యాయి. తొలుత ప్రిన్సిపల్ ఛాంబర్‌లో పాలకవర్గంతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు. అనంతరం సెమినార్ హాలులో పాలకవర్గం, అధ్యాపకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు తమకు నాలుగు నెలల జీతాలు ఇవ్వాలని, సమ్మె కాలాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. వెంటనే జీతాలు వేస్తేనే తాము సమ్మె విరమించి విధుల్లో చేరుతామని చెప్పారు. వీరి డిమాండ్లను కరస్పాండెంట్ మంగెన వెంకటసత్య నారాయణమూర్తి, పాలకవర్గ సభ్యుడు రుద్రరాజు పద్మరాజు అంగీకరించలేదు. దీంతో అధ్యాపకులు పాలకవర్గం వైఖరికి నిరసన తెలిపారు.



వాడపల్లిలో ఆధ్యాత్మిక పరిమళం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర ఆలయం ఆదివారం అశేష భక్తజనంతో శోభిల్లింది. ఈ సందర్భంగా అష్టోత్తర శతనామావళి పూజలు, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలను అర్చకులు కమనీయంగా జరిపించారు. స్వామివారికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్ఎస్ చక్రధరరావు పట్టువస్త్రాలు సమర్పించారు. నేటి నుంచి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం కొత్త శోభను సంతరించుకుంది.

అంబాజీపేటలో జోరువాన

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట మండలంలో ఆదివారం ఉదయం నుంచి జోరువాన కురిసింది. పల్లపు ప్రాంతాలు మునిగాయి. కొర్లపాటివారిపాలెం, మాచవరం, గంగలకుర్రు, తొండవరం, ముక్కామల ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

పల్లెల్లో ప్రగతికి ప్రభుత్వం చొరవ

పి.గన్నవరం, కొత్తపేట, మామిడికుదురు, న్యూస్‌టుడే: పల్లెల్లో ప్రగతి కోసం కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన కె.ముంజవరం, ఆర్.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి, లంకలగన్నవరం, మొండెపులంక, వాడ్రేవుపల్లి, మానేపల్లి, నాగుల్లంక గ్రామాల్లో సిమెంటు రహదారి పనులకు భూమిపూజ చేశారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నియోజకవర్గ తెదేపా పరిశీలకుడు షేక్ సుబాన్, కూటమి నాయకులు తోలేటి సత్యనారాయణమూర్తి, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండగ కార్యక్రమంలో కొత్తపేట శాసనసభ్యుడు బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. పల్లె ప్రగతే కూటమి ధ్యేయమన్నారు. కంఠంశెట్టి శ్రీనివాసరావు, మెర్లగోపాలం, ఈదల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

● గ్రామాల్లో సమస్యలు పట్టించుకోకుండా, అభివృద్ధికి నిధులు కేటాయించకుండా గత వైకాపా పాలకులు అయిదేళ్లు ప్రజలను మభ్యపెట్టి అంతా అస్తవ్యస్తంగా మార్చేశారని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మామిడికుదురు, గెద్దాడ, కొమరాడ, మగటపల్లి, గోగన్నమఠం, కరవాక గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో నరేగా నుంచి మంజూరైన రూ.1.24 కోట్లతో 25 సిమెంటు రహదారి పనులకు భూమిపూజలు చేశారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పినపళ్లలో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు



ఆర్.ఏనుగుపల్లిలో.. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



మామిడికుదురులో సమస్యలపై మాట్లాడుతున్న రాజోలు ఎమ్మెల్యే దేవ

నాడు-నేడు పనుల నిర్వహణపై ఫిర్యాదు

ఆలమూరు, న్యూస్‌టుడే: బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నాడు-నేడు పనుల్లో జరుగుతున్న జాప్యం, నిధుల వినియోగంపై విద్యాకమిటీ ఛైర్మన్ ఇందుగుల సుబ్బలక్ష్మి, కమిటీ సభ్యులు కలిసి ఆదివారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎంపీడీవో జోన్ లింకన్‌లకు ఫిర్యాదు పత్రాన్ని అందించారు. నిధులు నాలుగు నెలల క్రితమే బ్యాంకు నుంచి తీసుకున్నా వాటిని ఖర్చు చేయకుండా ఉంచారని ఆరోపించారు. పనులు అసంపూర్తిగా నిలిపివేయడంతో పాఠశాల ఆవరణలో నీరు నిలిచి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.



అసంపూర్తి భవనం.. రోగులకు ఇక్కట్లు

సఖినేటిపల్లి పీహెచ్‌సీ భవనం అసంపూర్తిగా నిలిచిపోవడంతో రోగులకు ఇక్కట్లు తప్పడంలేదు. 2020లో వైకాపా ప్రభుత్వం రూ.1.5 కోట్లతో దీన్ని మంజూరు చేసింది. పాతది భవనం తొలగించి ఇక్కడ జరిగే వైద్యసేవలు సమీప గృహనిర్మాణ సంస్థ భవనంలోకి మార్చారు. దీంట్లో ఒక గది, హాల్ మాత్రమే ఉన్నాయి. సిబ్బంది, వైద్యాధికారి, సామగ్రికే స్థలం సరిపోతుంది. వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చే రోగులు బయటే నిరీక్షించాల్సిన పరిస్థితి. గతంలో ప్రతిరోజు వంద వరకు ఓపీ, నెలలో 10 నుంచి 20 వరకు కు.ని., ఇతర శస్త్రచికిత్సలు జరిగేవి. ప్రస్తుతం అరకొర ఓపీ తప్ప శస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. ఆర్అండ్‌బీ జేఈ సురేష్‌ను వివరణ కోరగా నిధుల కోసం ఉన్నతాధికారులకు తెలియజేశామని, వచ్చిన వెంటనే భవనాన్ని పూర్తిచేసి ఆ శాఖకు అప్పగిస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

ప్రారంభించారు.. వదిలేశారు

సార్వత్రిక ఎన్నికల ముందు అంబాజీపేట మండలంలోని వివిధ గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పలు ప్రభుత్వ భవనాలను అప్పటి ఎమ్మెల్యే హడావుడిగా ప్రారంభించేశారు. ప్రస్తుతం అవన్నీ నిరుపయోగంగా మారాయి. రూ.లక్షలు వ్యయం చేసి గ్రామ సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలను గత వైకాపా ప్రభుత్వంలో నిర్మించారు. వీటిల్లో చాలావరకు అసంపూర్తిగానే పనులు జరిగాయి. ఎన్నికల నియామవళి అమల్లోకి వచ్చేస్తుందని అదరాబాదరాగా అప్పటి పాలకులు ప్రారంభించేశారు. పుల్లేటికుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మాచవరం తదితర గ్రామాల్లోని ఆయా భవనాలను ప్రారంభించేశారు. ఇప్పుడు వాటిని అలాగే వదిలేశారు.

- న్యూస్‌టుడే, అంబాజీపేట





రహదారి పనుల్లో కదలిక

పి.గన్నవరం నియోజకవర్గంలో రూ.32 కోట్లతో ఆర్అండ్‌బీ రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వైకాపా ప్రభుత్వంలో టెండర్ ఖరారైనప్పటికీ గుత్తేదారుడికి పెండింగ్ బిల్లులు చెల్లించని కారణంగా పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటికి కదలిక వచ్చింది. అంబాజీపేట-పి.గన్నవరం, బోడిపాటివారిపాలెం-నరేంద్రపురం, పి.గన్నవరం-నరేంద్రపురం, ముక్కామల-మడుపల్లి, జగ్గన్నతోట ప్రభలతీర్థం రహదారులకు ప్రాధాన్యం కల్పించారు. అవసరాన్ని బట్టి కొన్నిచోట్ల సీసీ, తారురోడ్లు వేయనున్నారు. రహదారులు కుంగిన ప్రాంతాల్లో రక్షణగోడలు నిర్మించనున్నారు. ఇప్పటికే గుత్తేదారుడు రూ.5 కోట్ల విలువైన మెటీరియల్‌ను ఆయా ప్రాంతాల్లో సిద్ధం చేశారు. సంక్రాంతి నాటికి పూర్తవుతాయని, సీఆర్ఎఫ్ నిధులతో వీటిని చేపట్టనున్నట్లు ర.భ.శాఖ డీఈ జి.రాజేంద్ర తెలిపారు.

-న్యూస్‌టుడే, పి.గన్నవరం

తాతాజీ మృతికి సంతాపం



తాతాజీ (పాత చిత్రం)

మలికిపురం, న్యూస్‌టుడే: లక్కవరం పీఏసీ సొసైటీ మాజీ అధ్యక్షుడు మంగెన ముత్యాలు (తాతాజీ) మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తాతాజీ(84) ఆదివారం ఉదయం మృతిచెందారు. ఆయన సొసైటీ అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. మంత్రిగా పనిచేసిన దివంగత సంగిత వెంకటరెడ్డి, రాజోలు మాజీ ఎమ్మెల్యే దివంగత మంగెన గంగయ్యలకి ఈయన సమీప బంధువు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలంగా ఉండేవారు.

హామీలు నెరవేర్చాల్సిందే..

మామిడికుదురు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని వెంటనే అమలు చేయాలని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన నగరం నుంచి పాశర్లపూడి వరకు ఆదివారం బస్సులో ప్రయాణించారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని వెంటనే అమలు చేయాలంటూ ప్రయాణికులతో సీఎంకు పోస్టు కార్డులు రాయించారు. అప్పన శ్రీరామకృష్ణ, మహ్మద్ ఆరిఫ్, మాచవరపు శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు సిద్ధం కావాలి

కొత్తపేట న్యూస్‌టుడే: ఉభయగోదావరి జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కొత్తపేట క్లస్టర్ 1 పరిధిలో బూత్ కన్వీనర్లు ఓటు నమోదులో కీలక పాత్ర పోషించాలని తెదేపా మండల అధ్యక్షులు కంఠంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కొత్తపేటలో వాసంశెట్టి సత్యానారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఓటింగ్ సంబంధించి అక్టోబర్ 31, 2021 నాటికి డిగ్రీ పూర్తిచేసి ఉండాలన్నారు. తెదేపా జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జీ, మండల ప్రధాన కార్యదర్శి భాస్కరరావు, బూత్ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.



క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌ల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు



మంచాలపై దుప్పట్లు లేకుండానే..

రోగుల మంచాలపై దుప్పట్లు లేకుండానే వైద్యం అందిస్తున్న తీరు ఆదివారం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో కనిపించింది. పారిశుద్ధ్యం సరిగాలేక దుర్వాసన వెదజల్లుతోందని, రాత్రుళ్లు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని కొందరు రోగులు చెబుతున్నారు. అధికారులు స్పందించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలంటున్నారు.

- న్యూస్‌టుడే, కొత్తపేట

ఆర్భాటంగా చేపట్టి.. మధ్యలోనే విడిచిపెట్టి!

అన్ని గ్రామాల్లోనూ సచివాలయాలు, రైతు భరోసా(సేవ), వెల్‌నెస్ కేంద్రాలకు శాశ్వత భవనాలను సమకూర్చేందుకు గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన పనులు పలుచోట్ల అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఉపయోగం కరవైంది. ఏడాదిలో పూర్తి కావాల్సిన భవనాలు చివరికి వివిధ దశల్లో ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టి పూర్తిచేసి ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, రాజోలు, మామిడికుదురు

రాజోలు నియోజకవర్గంలో 2020 మార్చిలో ఆయా భవన నిర్మాణాలకు నాయకులు ఆర్భాటంగా భూమి పూజలు చేశారు. సకాలంలో నిధులు ఇవ్వకపోవడం, ఆపై పూర్తిగా నిలిపివేయడంతో చాలాచోట్ల పలు దశల్లో నిరుపయోగంగా ఉన్నాయి. 58 గ్రామ సచివాలయాలకు 32 చోట్ల పూర్తికాలేదు. రైతుభరోసా కేంద్రాలు 63 మంజూరు కాగా నాలుగుచోట్ల మినహా మిగతావన్నీ వివిధ దశల్లో ఆగిపోయాయి. 58 వెల్‌నెస్ కేంద్రాలకు గాను మూడుచోట్ల పూర్తిచేశారు. 9 చోట్ల పనులే చేపట్టకపోగా 46 నిర్మాణాలు నిధులు లేక మధ్య, చివరి దశల్లో నిలిచిపోయాయి.

ప్రజలను మభ్యపెట్టేందుకే..

నిధులు లేకపోయినా ప్రజలను మభ్యపెట్టేందుకు అన్ని శాఖల భవన నిర్మాణాలను వైకాపా ప్రభుత్వం ఒకేసారి చేపట్టడంతో అవి వివిధ దశల్లో నిలిచిపోయి నిరుపయోగంగా మారే పరిస్థితికి చేరుకున్నాయి. వెల్‌నెస్ కేంద్రాలకు రూ.17.50 లక్షలు, ఆర్బీకేలకు రూ.21.80, సచివాలయాలకు రూ.25 నుంచి 40 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ఇవన్నీ దాదాపు 2121 సంవత్సరాంతానికి పూర్తికావాలి. అప్పటికే మండలానికి రూ.40 నుంచి రూ.50 లక్షల వరకు బకాయిలు పేరుకుపోవడంతో గుత్తేదారులు ససేమిరా అనడంతో ఎక్కడికక్కడే ఆగిపోయినా అప్పటి పాలకులకు పట్టకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయాయి.



పాశర్లపూడిలంకలో అసంపూర్తిగా నిలిచిన వెల్‌నెస్ భవనం

పరిపూర్తికి కార్యాచరణ

రాజోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు 4 ఆర్బీకే, 26 సచివాలయాలు, 3 వెల్‌నెస్ భవనాలు పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. వీటి గురించి ఉన్నతాధికారులకు నివేదించాం.

- వి.చంద్రశేఖర్, డీఈఈ, పంచాయతీరాజ్, రాజోలు

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం



కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

త్యాగరాజ ఆరాధనోత్సవాలు

యానాం, న్యూస్‌టుడే: యానాం చింతావారిపేట రామాలయం వద్ద ఆదివారం త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. సంగీత కళాకారులు చెల్లపిళ్ల మైథిలి, రెడ్డి రమణమూర్తి, పెద్దింటి లక్ష్మణప్రసాద్ ఆధ్వర్యంలో త్యాగరాజ కీర్తనలు పంచ రత్నాలు ఆలపించారు. తొలుత త్యాగరాజ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

వైభవంగా శిఖరాల ఊరేగింపు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: చల్లపల్లి గ్రామదేవత మహిషాసురమర్దిని అమ్మవారి విగ్రహప్రతిష్ఠ మహోత్సవం సోమవారం జరగనుంది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ శిఖరాలను, విగ్రహాన్ని ఆదివారం గ్రామంలో అశ్వవాహనంపై ఊరేగించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



అశ్వరథంపై ఆలయ శిఖరాలు..

వీధికుక్కల స్వైర విహారం

• నియంత్రణకు చర్యలు ఎక్కడ..?

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

అమలాపురం పట్టణంలో కుక్కలు భయాందోళన సృష్టిస్తున్నాయి. జనం తినిపారేసిన ఆహార పదార్థాలు తింటూ.. రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఖాళీ స్థలాల్లో జనం పారేస్తున్న ఆహారపదార్థాలను తింటూ ఏటా వీటి సంఖ్యను పెంచుకుంటున్నాయి. నడిచి వెళ్లేవారితో పాటు వాహన చోదకుల వెంటపడి దాడి చేస్తున్నాయి. బాధితుల్లో ఎక్కువ మంది చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఉంటున్నారు. వీటి నియంత్రణకు పురపాలక యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడ చూసినా..

పట్టణంలో హౌసింగ్‌బోర్డుకాలనీ, విద్యుత్తునగర్, సావరం, సినిమారోడ్డు, కె.అగ్రహారం, సూర్యనగర్, భూపయ్యఅగ్రహారం, నారాయణపేట, కొంకాపల్లి తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ప్రతి వీధిలో పదుల సంఖ్యలో తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రిపూట గట్టిగా అరుస్తుండటంతో నిద్ర పట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. పిల్లలను బయటకు పంపించేందుకు భయమేస్తోందని స్థానికులు వాపోతున్నారు.



అమలాపురంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో కుక్కల గుంపు

హడావుడి చేసి.. మరిచిపోయి..

వీధి కుక్కలకు జనన నియంత్రణ శస్త్రచికిత్స కోసం పురపాలక అధికారులు గతంలో రూ.2 లక్షలు కేటాయించారు. ఎంతవరకు వాటిని నియంత్రించారో తెలియని పరిస్థితి. వీటికి శస్త్రచికిత్స చేసేందుకు రూ.1300 నుంచి రూ.1800 ఖర్చు అవుతుందని పశువైద్యులు చెబుతున్నారు. పట్టణంలో గురువారం ఒక ఓ కుక్క 25 మందిపై దాడి చేసింది. ఆ రోజు హడావుడి చేసిన అధికారులు తర్వాత ఈ సమస్య గురించి పట్టించుకోలేదు.



పురపాలక కార్యాలయంలో కుక్కల శస్త్రచికిత్స కోసం కేటాయించిన గది



కుక్కలను బంధించే పరికరాల పరిస్థితి

ఆసుపత్రిలో చేరాం..

నేను, నా భర్త ఇంటి ఆవరణలో ఉండగా మూడు రోజుల క్రితం మా ఇద్దరిపై కుక్క దాడి చేసింది. కాలి కండను లాగేసింది. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాం. మాతో పాటు పట్టణానికి చెందిన మూడేళ్ల పిల్లాడు కూడా చికిత్స పొందుతున్నాడు. కుక్కలకు భయపడి రాత్రిళ్లు బయటకు రావాలంటే భయంగా ఉంది. శునకాల బెడద లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

-చప్పిడి అనంతలక్ష్మి, గృహిణి, సీతాపతిరావుపేట

కట్టడికి చర్యలు

పట్టణంలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. వీటి నియంత్రణ బాధ్యతను ఓ ఏజెన్సీకు ఇచ్చేందుకు ఒప్పందం జరుగుతోంది. పట్టణంలో కుక్కలకు యాంటీ ర్యాబీస్ టీకాలు వేశారు. ప్రత్యేక దృష్టిపెట్టి వాటికి యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) శస్త్రచికిత్సలు చేయిస్తాం.

- కెవీవీఆర్ రాజు, మున్సిపల్ కమిషనర్

ప్రత్యేక అలంకరణలో సిద్ధివినాయకుడు



అయినవిల్లి, న్యూస్‌టుడే: సంకటహర చతుర్థి పర్వదినం సందర్భంగా ఆదివారం సిద్ధివినాయకస్వామి ఆలయం కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు, అయ్యప్పస్వాములు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

కోత సమస్య పరిష్కరించాలని లేఖ

అల్లవరం, న్యూస్‌టుడే: ఓడలరేవులో సముద్రపు కోత సమస్యను పరిష్కరించాలని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి లేఖ రాసినట్లు అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ తెలిపారు. గతంలో జరిగిన ప్రమాదాలకు విడుదల చేయాల్సిన నష్టపరిహారాన్ని తక్షణం విడుదల చేయాలని ఆమె లేఖలో పేర్కొన్నారు. ఓడలరేవులో సముద్రం రోజురోజుకూ ముందుకు చొచ్చుకువస్తున్న కారణంగా నీరు ప్లాంట్‌లోకి చేరుతోందన్నారు. తక్షణం రక్షణ చర్యలు తీసుకోకపోతే ప్లాంట్‌కు, గ్రామానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

27న యానాంలో కవి సంధ్య స్వర్ణోత్సవ సభ

యానాం, న్యూస్‌టుడే: యానాం కేంద్రంగా వెలువడుతున్న కవి సంధ్య కవిత్వ పత్రిక 50 సంచికలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ నెల 27న స్వర్ణోత్సవ సభ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు యానాం గీతా భవన్‌లో కార్యక్రమం జరుగుతుందని డాక్టర్ శిఖామణి తెలిపారు.

హలో.. హలో.. వినిపించడం లేదు..!

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

అమలాపురం మండలం సవరప్పాలెంలోని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ పరిధిలోని అయిదు గ్రామాలకు సేవల్లో అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు అందింది. 20 రోజులు గడుస్తున్నా పరిష్కారం కాలేదని వాపోతున్నారు. ఈ సెల్‌టవర్‌కు విద్యుత్తు సరఫరా నిలిచిపోతే సవరప్పాలెం, సమనస, వన్నె చింతలపూడి, రంగాపురం, కిత్తనచెరువు, తదితర గ్రామాల పరిధిలోని వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెట్‌వర్క్ సమస్యతోపాటు విద్యుత్తు సరఫరా లేని సమయాల్లో సెల్‌ఫోన్ పనిచేయకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. ఈ సెల్‌టవర్‌కు సంబంధించి బ్యాటరీలు పాడైపోవడంతో సమస్య మొదలైంది. ఆరు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సెల్‌టవర్

ప్రతిపాదనలు పంపాం..

సవరప్పాలెం సెల్‌టవర్ సమస్యను ఉన్నతాధికారులకు వివరించాం. టవర్ వద్ద బ్యాటరీలు మార్చాల్సి ఉంది. త్వరలోనే బ్యాటరీలు వస్తాయి. సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతాం.

– పి.శ్రీనివాస్, జేఈ, బీఎస్ఎన్ఎల్, అమలాపురం

ఉపాధి నిధులతో గ్రామాల అభివృద్ధి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం మండలం పేరూరు, సాకుర్రు, గున్నేపల్లి అగ్రహారం, నడిపూడి, సమనస, వన్నెచింతలపూడి, సవరప్పాలెం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాల్లో భాగంగా పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో రహదారులు, మురుగుకాలువలు ఏర్పాటు చేసే దిశగా నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. వైకాపా పాలనలో అభివృద్ధికి నోచుకోని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బొర్రా ఈశ్వరరావు, యేడిద వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు అధికారి జయవెంకట లక్ష్మి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు మట్ట పోలయ్య, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు

అల్లవరం, న్యూస్‌టుడే: దేవగుప్తం విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో పని చేస్తున్న తమను గుండెపూడికి చెందిన కొందరు వ్యక్తులు దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించారని జూనియర్ లైన్‌మెన్‌లు సింహాద్రి, రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉప కేంద్రం పరిధిలో విద్యుత్తు సరఫరాలో సమస్య రావడంతో లైన్లు పరిశీలిస్తుండగా ఆక్వా చెరువుల యజమానులు తమపై దురుసుగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా ట్రాన్స్‌కో సిబ్బంది నుంచి ఫిర్యాదు వచ్చిందని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

నిర్మించారు.. ప్రారంభం మరిచారు



అమలాపురం మండలం సవరప్పాలెంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ భవనమిది. గత ప్రభుత్వ హయాంలో ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. భవనాన్ని ప్రారంభించేందుకు ఇప్పటికీ చర్యలు చేపట్టడం లేదు. అద్దె భవనంలోని అరకొర వసతులతో వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతూ సేవలందిస్తున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

తుప్పలు తొలగించరూ..!



కాట్రేనికోనలోని జిల్లెల్లవారిపేటలోని శ్మశానవాటికలో తుప్పలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తుప్పలు తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని సర్పంచి సుధాకర్ వద్ద ప్రస్తావించగా తుప్పలు తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కాట్రేనికోన

ఆగిన భవనం.. సేవలు దూరం



ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పంచాయతీ పరిధి వాసాలతిప్పలో చేపట్టిన విలేజ్‌హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం పనులు ఏడాదిగా నిలిచిపోయాయి. ఈ భవనం పూర్తయితే తీర ప్రాంతంలో వైద్య సేవలు అందుతాయని గ్రామస్థులు ఆశించారు. ఇక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో సౌఖర్యాలు లేని భవనంలో ప్రస్తుతం క్లినిక్ నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

నిత్యాన్నదాన పథకానికి వితరణ

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి నిడమనూరుకు చెందిన తాతానేని కృష్ణచైతన్య దంపతులు ఆదివారం రూ.50వేలు అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణకు దాతను సత్కరించి స్వామివారి చిత్రపటం బహూకరించారు.



కృష్ణచైతన్య దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేత

ఆలయాల వద్ద అన్నదానాలు

యానాం: దరియాలతిప్ప, ఓల్డ్ రాజీవ్‌నగర్, యుకేవీ నగర్‌లో వెలిసిన కనకదుర్గమ్మ ఆలయాల వద్ద ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమాలకు పుదుచ్చేరి ప్రభుత్వ దిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరై భక్తులకు అన్నదానం చేశారు.

అధ్వాన రహదారిలో అవస్థల ప్రయాణం

న్యూస్‌టుడే, కాట్రేనికోన, ఉప్పలగుప్తం

అత్యవసర సమయంలో ప్రయాణం గ్రామీణులకు భారంగా మారింది. ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల్లోని పలుగ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి.

● అమలాపురం మండలం సమనస నుంచి ఉప్పలగుప్తం మండలం భట్టుపాలెం వరకు రహదారి గోతులతో అధ్వానంగా తయారయ్యింది. ● కిత్తనచెరువు గ్రామం నుంచి భట్టుపాలెం భట్టుపాలెం రహదారి అడుగడుగునా భారీ గోతులతో ఉంది. ● అమలాపురం మండలం సవరప్పాలెం నుంచి ఎస్.యానాం వరకు రహదారి గోతుల పడి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. ● సిరిపల్లి నుంచి మునిపల్లి వరకు రహదారిలో మునిపల్లి, భీమనపల్లి తదితర గ్రామాల్లో గోతులు అడుగడుగునా కనిపిస్తున్నాయి. ● గొల్లవిల్లి ఓఎన్జీసీ కూడలి నుంచి ఉప్పూడి గ్రామం వరకూ వేసిన రహదారి ఐదేళ్లుగా అభివృద్ధికి నోచకోక అడుగడుగునా అవస్థలు పడుతున్నారు.



మొండిపోర రోడ్డు పరిస్థితి

● కాట్రేనికోన మండలంలో మావుళ్లమ్మగుడి నుంచి నడవపల్లి వెళ్లే పీఆర్ రోడ్డు పలుచోట్ల గుంతలు పడింది. దేవి సెంటర్, నడవపల్లి, లచ్చిరాజుచెరువు తదితరచోట్ల గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కంచువారిపేట నుంచి మొండిపోర రోడ్డు సైతం అడుగుకో గుంతలా మారింది. సత్తెమ్మచెట్టు, సహశివారు ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు ఈ రోడ్డునే వినియోగిస్తారు.



కిత్తనచెరువు వద్ద రహదారి దుస్థితి

● రేవువారిపేట, వేట్లపాలెం- గచ్చకాయలపోర రోడ్డు, కాట్రేనికోన-రామస్వామితోట రోడ్డు పలుచోట్ల గుంతలతో ఉంది. ఈ గుంతల రోడ్లలో వర్షపునీరు చేరడంతో ఎక్కడికక్కడ అధ్వానంగా మారతున్న పరిస్థితులు ఉన్నాయి.


చర్యలు తీసుకుంటాం

కాట్రేనికోనలో కొన్ని రోడ్ల నిర్మాణాలకు ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే ఇటీవల శంకుస్థాపనలు చేశారు. త్వరలోనే నిర్మాణం మొదలుపెడతాం. మిగిలిన రోడ్ల నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం.

– ఫకీర్, మండల జేఈ, కాట్రేనికోన

మేమున్నాం.. మీకు తోడుగా

వీధి దీపాలకు మరమ్మతులు



సమస్య: దొంతికుర్రు పరిధిలో కొన్నిచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలి. – స్థానికులు

స్పందనకు వందనం

పరిష్కారం: సమస్యను సర్పంచి ఈశ్వరి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేయించారు.

బ్లీచింగ్ చల్లించారు

సమస్య: కాట్రేనికోనలో రోడ్డుపక్కన పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి బ్లీచింగ్ చల్లించే పనులు చేపట్టాలి. – గ్రామస్థులు

పరిష్కారం: ఈ సమస్యను సర్పంచి సుధాకర్‌కు తెలుపగా స్పందించారు. సిబ్బందితో పరిసరాల్లో బ్లీచింగ్ చల్లించే పనులు చేపట్టారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166

ఆదాయం రూ.కోట్లలో.. ఆవాసం శిథిల భవనాల్లో

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

రూ.కోట్లలో ఆదాయం తెచ్చిపెడుతున్న రిజిస్ట్రార్, అబ్కారీ ప్రభుత్వశాఖల కార్యాలయాల పరిస్థితి దారుణంగా మారింది. శిథిల భవనాలల్లో కొనసాగుతున్నాయి. దశాబ్దాల తరబడి సిబ్బంది చిన్న చిన్న అద్దె గదుల్లో, పాడుబడిన శిథిల భవనాలలో విధులు నిర్వహిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

● స్థానిక నల్లవంతెన ఎన్టీఆర్ మార్గ్‌లో 1910లో నిర్మించిన పాత భవనంలోనే రిజిస్ట్రేషన్లశాఖ కార్యాలయం ఉంది. ఏళ్ల నాటి దస్తావేజులు అక్కడే ఉన్నాయి. రెండేళ్ల క్రితం మరమ్మతులు చేయించుకుని ఇక్కడే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఇరుకుగా ఉండటంతో క్రయవిక్రయదారులు, సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. పెచ్చులు ఊడిపడుతున్నాయి. దస్తావేజులు, కంప్యూటర్లు తడవకుండా కాపాడుకుంటున్నారు. దీనిపై సబ్‌రిజిస్ట్రార్ ఆర్.శ్రీలక్ష్మిని వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో..



అమలాపురంలోని అబ్కారీశాఖ కార్యాలయం పరిస్థితి

● ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం తెచ్చేవాటిలో అబ్కారీశాఖ ఒకటి. అమలాపురం పట్టణంలో నల్లవంతెన దిగువన దశాబ్దాల క్రితం నిర్మించిన భవనంలో ఈ కార్యాలయం నిర్వహిస్తున్నారు. పల్లపు ప్రాంతంలో ఉండటంతో కార్యాలయం లోపలికి నీరు ప్రవేశిస్తోంది. దస్త్రాలు తడిసిపోతున్నాయి. శ్లాబు పెచ్చులూడి పడుతోంది.



నియంత్రికపై నిర్లక్ష్యమేల?

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తాపేశ్వరం సచివాలయం2 పక్కన విద్యుత్తు నియంత్రికపై పాదులు ఉండటం కారణంగా ఆ ప్రాంతం చిట్టడవిని తలపిస్తోంది. పాదులు నియంత్రిక చుట్టూ ఉండటం వల్ల రాత్రి సమయంలో గాలికి నిప్పులు వస్తున్నాయి. దీనిపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

మండపేట

• మండపేట • రామచంద్రపురం

వినాయకుడికి లక్ష గరిక పూజ

మండపేట, న్యూస్‌టుడే: సంకట హర చతుర్థి పురస్కరించుకుని మండపేట పట్టణంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వినాయకుడికి లక్ష గరిక పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు అయినవిల్లి సూర్యసుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పూజలో పాల్గొన్నారు.



అలంకరణలో వినాయకుడు

మేమున్నాం.. మీకు తోడుగా

మురుగుపారుదలకు చర్యలు

ద్వారపూడి: మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధి వస్త్రదుకాణ వీధి డ్రెయిన్‌లో మురుగుపారడంలేదని, దీంతో దుర్వాసన వెదజల్లుతుందని 19న మేమున్నాం..మీకు తోడుగాలో మురుగుపారడంలేదు శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి ఆకుల వీవీ.రమణ స్పందించారు. వెంటనే ప్రత్యేక దృష్టి సారించి పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు చేపట్టారు. మురుగుపారుదలకు చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

స్పందనకు సందనం

పూడిక తొలగించారు

ద్వారపూడి: మండపేట మండలం జడ్.మేడపాడు పంచాయతీ పరిధి రజక వీధిలో డ్రెయినేజీలో మురుగు పారుదల అధ్వానంగా ఉందని దీంతో దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీ కార్యదర్శి వి.అమర్‌నాథ్‌చౌదరికి వివరించగా స్పందించారు. వెంటనే మురుగు పారుదల పనులు చేపట్టి పూడిక తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేసారు.

– న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

సమస్య: పాలతోడు ప్రధాన రహదారిలో సరిగా విద్యుత్ దీపాలు రాత్రి వెలగటంలేదు. దీంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రామాంజనేయులు, పాలతోడు.

సమాధానం: ఈమధ్యకాలంలో కురిసిన వర్షాలకు విద్యుత్తు దీపాలు మరమ్మతులకు గురవుతున్నాయి. పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, పాలతోడు**

సమస్య: తాపేశ్వరం- పేకేటిపాకల కాల్వలో ఈ మధ్య కాలంలో చెత్త, చెదారాలను కాల్వలో పడేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. **- వీర్రాజు, పేకేటిపాకల.**

సమాధానం: కాల్వలో చెత్తాచెదారాలు వేస్తే కఠిన చర్యలు చేపడతాం. దీనిపై తమ లస్కర్లతో పరిశీలిస్తాం.

- అజీజ్, నీటిపారుదలశాఖ, జేఈ, తాపేశ్వరం సెక్షన్

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మండపేట: 80085 74183, రామచంద్రపురం: 80085 74191

పరిశీలన ఎక్కడి పనులు అక్కడే

అర్ధాంతరంగా ఆగిన ప్రభుత్వ భవన నిర్మాణాలు

మండపేట గ్రామీణం: వైకాపా ప్రభుత్వం హయాంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ పేరిట భవనాల నిర్మాణాలను అట్టహాసంగా చేపట్టారు. ప్రారంభంలో ఉన్న హడావుడి ఆ తర్వాత లేదు. పూర్తి స్థాయిలో నిధులు ఇవ్వకపోవడంతో చాలా భవనాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అవి అందుబాటులోకి రాకపోయినా సార్వత్రిక ఎన్నికలకు ముందు వైకాపా నాయకులు ఆర్భాటంగా కొన్నింటిని ప్రారంభించారు. ఆ తర్వాత వాటి ఊసే మరిచారు.

నత్తనడకన సచివాలయం



నిర్మాణంలో ఇప్పనపాడు సచివాలయం-1

మూడేళ్ల క్రితం ప్రారంభించిన ఇప్పనపాడు సచివాలయం-1 భవన నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. రెండు స్లాబ్‌లు నిర్మాణం, పైన రక్షణగోడ నిర్మిస్తున్నారు. ఇంకా టైల్స్ పనులు పూర్తి కావాల్సి ఉంది. రూ.40లక్షల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించగా అవి సాగుతూ..నే ఉన్నాయి. మరో రూ.7 లక్షల పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో...



ఇప్పనపాడులో పునాదులు దాటని విలేజ్ క్లినిక్

ఇప్పనపాడు విలేజ్ క్లినిక్ సెంటర్ పనుల్లో భాగంగా బోర్లు వేసి ఊచలు పైకి ఉంచారు. ఇంకా 98శాతం పనులు అవ్వాల్సి ఉండగా పనులు అయ్యేనా అనే ప్రశ్న ప్రజల్లో ఉంది. రూ.18 లక్షల నిర్మాణ వ్యయంతో పనులు ప్రారంభించగా పనులు సాగడం లేదు. ఇంకా కాంక్రీట్ పనులు ప్రారంభం కాలేదు.

రైతులకు ఎప్పుడు భరోసా

తాపేశ్వరం రైతు భరోసా కేంద్రం రూ.23.94 లక్షల అంచనా వ్యయంతో ప్రారంభమైంది. ఎన్నికల నియమావళి వరకు నిర్మాణం పూర్తయ్యే సరికి గుత్తేదారునికి బిల్స్ ప్రభుత్వం చెల్లించింది. అప్పటినుంచి పనులు ముందుకు వెళ్లడంలేదు. అసలు ఈ భవనం పూర్తి అవుతుందా లేదా అనేది ప్రశ్న.



తాపేశ్వరం సచివాలయం-2 ప్రక్కన రైతు సేవా కేంద్రం భవనం

హడావుడిగా ప్రారంభించారు

ఇప్పనపాడు-2 సచివాలయం భవనం ఎన్నికల నియమావళి వస్తుందనే తొందరలో అప్పటి నాయకులు హడావుడిగా ప్రారంభించారు. రూ.43 లక్షలతో నిర్మిస్తుండగా విద్యుత్తు, నీటి సదుపాయం వంటివి పూర్తి కావాల్సి ఉంది. సుమారు రూ.లక్ష వెచ్చించాల్సి ఉంటుంది.



పూర్తి అయినా ప్రారంభం కాని సచివాలయం-2

ముందుకు సాగేనా

పాలతోడు రైతు సేవా కేంద్రం భవనాన్ని రూ.21లక్షల వ్యయంతో పనులు ప్రారంభించి స్లాబ్ దశవరకు పూర్తిచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన తరుణంలో నిర్మించే పనులకు డబ్బులు పడతాయా లేదా అనే మీమాంస ఉండటంతో నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు.



పాలతోడులో స్లాబ్ స్థాయి పూర్తికాని సచివాలయ భవనం

అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు

ఎన్నికల ముందు ప్రారంభోత్సవాలు చేసిన అన్ని భవనాలను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం. నిర్మాణాలు ఎంతవరకు చేశారో అంతవరకు బిల్లులు గుత్తేదారుల ఖాతాల్లోకి చేరాయి. పనులు పూర్తికాని వాటికి ఇంకా నిధులు కావాల్సి వస్తే ఉన్నతాధికారులకు నివేదిక పంపాము. త్వరితగతిన భవనాల పనులు పూర్తిచేసి సంబంధిత అధికారులకు అప్పగించేందుకు కృషిచేస్తున్నాం.

- నాగేశ్వరరావు, మండల ఇంజినీరింగ్ అధికారి, మండపేట

రక్షిత నీరు వృథా చూడు

ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట మండలం కేశవరం గ్రామ పరిధి దేవుడుతాళ్ళ కాలని పంచాయతీ రెండో రక్షిత మంచినీటి ట్యాంకు కొళాయి నుంచి రక్షిత మంచి నీరు వృథాగా పోతుంది. బయటకు వచ్చే నీటి గొట్టానికి ట్యాప్ లీక్ అవ్వడంతో నీరు పోతుందని స్థానికులు అంటున్నారు. గత కొన్ని రోజులుగా ఇలా జరుగుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే నీరు వృథా కాకుండా కొత్త ట్యాప్ బిగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎస్.సుబ్బారావును వివరణ కోరగా పరిశీలించి కొత్తట్యాప్ మారుస్తామన్నారు.



ట్యాప్ నుంచి వృథాగా పోతున్న రక్షిత మంచినీరు

రూ.6.70 కోట్లతో రహదారుల అభివృద్ధి

ద్రాక్షారామ, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నిర్మించనున్న పలు సీసీ రహదారులకు ఆదివారం మంత్రి వాసంశెట్టి సుభాష్ శంకుస్థాపన చేశారు. తొలుత వెలం పాలెం, తరువాత ద్రాక్షారామ నున్నవారి వీధుల్లో నిర్మించే సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్లలో రహదారులు అత్యంత దారుణంగా తయారైనా పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే రూ.6.70 కోట్లు నియోజకవర్గానికి కేటాయించడం జరిగిందన్నారు. త్వరలో మరో రూ.15కోట్లు మంజూరవుతాయని ఆయన తెలిపారు. నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, నారాలోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో మన రాష్ట్రం స్వర్ణాంధ్ర కాబోతుందని, ఈ ఐదేళ్లలో మనం దానిని చూడబోతున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కొత్తపల్లి అరుణ, టేకుమూడి సుజాత, ఎంపీడీవో కె.పద్మజ్యోతి కూటమి నాయకులు పాల్గొన్నారు.



ద్రాక్షారామలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సుభాష్

నిరుపేదకు చేయూత

పామర్రు: కె.గంగవరం మండలం బాలాంత్రం గ్రామంలో పత్తి వెంకటరమణ అనే వ్యక్తి ఇటీవల పక్షవాతానికి గురై కాళ్లు, చేతులు పనిచేయక మంచం పట్టారు. ఆదివారం గ్రామానికి వచ్చిన మంత్రి వాసంశెట్టి సుభాష్ అతన్ని పరామర్శించి రూ.5 వేలు సాయం చేశారు. స్థానిక నాయకులు మల్లిపూడి బుజ్జి మరో రూ.ఐదువేలు అందించారు.

జాగ్రత్త.. భారీ గోతులున్నాయి

ఇప్పనపాడు నుంచి పాలతోడు వెళ్లే దారిలో భారీగోతులు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ గోతులు సుమారు ఎనిమిది ఉన్నాయి. వీటిని తప్పించే క్రమంలో వాహనదారులు గోతుల్లోపడి ప్రమాదానికి గురవుతున్నారు. దీనిపై సంబంధిత ర.భ. శాఖాధికారులు స్పందించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనిపై ర.భశాఖ డీఈ సూర్యనారాయణను వివరణ కోరగా నియోజకవర్గంలో రహదారులను మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మంజూరైన తర్వాత పనులు చేపడతాం. **- న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం**



ఇప్పనపాడు నుంచి పాలతోడు వెళ్లే రహదారిలో భారీ గొయ్యి

భాజపా సభ్యత్వాల నమోదు



మొబైల్ యాప్ ద్వారా సభ్యత్వాల నమోదు చేస్తున్న భాజపా నాయకులు

ద్వారపూడి, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదు ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా పురపాలక సంఘాలు, గ్రామాల్లో జోరుగా సాగుతుందని జిల్లా సభ్యత్వ ప్రముఖ్ కోకన్వీనర్ కోన సత్యనారాయణ తెలిపారు. భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండపేట మండలం కేశవరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి మొబైల్ యాప్ ద్వారా సభ్యత్వాలు నమోదు చేశారు. కార్యక్రమంలో మండపేట నియోజకవర్గ సమన్వయకర్త కోటిపల్లి సాయిరామ్, సంగిశెట్టి శ్రీనివాస్, మర్రి రామచంద్రరావు, ఆర్ఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డు.. ప్రయాణికుల పాట్లు



ముచ్చుమిల్లి కవలవారి సావరం రోడ్డు

రామచంద్రపురం పట్టణ 18వ వార్డు ముచ్చుమిల్లి నుంచి కవలవారి సావరం వెళ్లే రోడ్డు పొడవునా ఐదు ప్రాంతాల్లో ప్రమాదకరమైన గోతులు ఏర్పడ్డాయి. రాజీవ్ గృహకల్ప సముదాయాలకు, కవలవారి సావరానికి వెళ్లే సుమారు 200 కుటుంబాలకు చెందిన ప్రజలు, ముఖ్యంగా 100 మంది విద్యార్థులు ఈ రోడ్డుపైనే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత పురపాలక అధికారులు స్పందించి తాత్కాలికంగానైనా గోతులు పూడ్చి అనంతరం బీటీరోడ్డును వేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా కవలవారి సావరం రోడ్డు అభివృద్ధి విషయంపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు కూటమి పార్టీ నాయకులు కవల నానాజీ పేర్కొన్నారు. ఈ సమస్యపై న్యూస్‌టుడే మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడుని వివరణ కోరగా త్వరలో కవలవారి సావరం రోడ్డును, అలాగే ఐదో వార్డు వైఎస్సార్ నగర్‌కు వెళ్లే రోడ్డును పరిశీలించి రెండు బీటీరోడ్లను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

వార్డు వెతలు

–న్యూస్‌టుడే, రామచంద్రపురం

కళాశాలకు వెళ్లే దారేది

కొద్దిపాటి వర్షం కురిసినా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గేటు దాటి లోపలకి వెళ్లడం కష్టంగా మారుతోంది. గేటు వద్ద నుంచి సుమారు 20 అడుగుల దూరంలో మాత్రమే సిమెంటు రోడ్డు వేశారు. గేటు నుంచి సిమెంటు రోడ్డు వరకు బురద కారణంగా జారిపోతోందని విద్యార్థులు అంటున్నారు. నడక దారికి ఇబ్బంది లేకపోయినా సైకిళ్లు, ద్విచక్ర వాహనాలపై వచ్చే విద్యార్థులకు మాత్రం ఇబ్బంది తప్పడంలేదు. ఇదే కళాశాలలో గతంలో అంతర్జాతీయ శాస్త్రవేత్తల సదస్సు జరిగింది. ప్రస్తుతం అంతర జిల్లాల కబడ్డీ పోటీలు కూడా జరుగుతున్నాయి. ఇన్ని ముఖ్య ఘట్టాలకు కేంద్రంగాఉన్న కళాశాల ప్రవేశ ద్వారం మాత్రం అధ్వానంగా ఉంది. దాతల సహకారంతో గ్రావెల్ వేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. **- న్యూస్‌టుడే, మండపేట**



రక్షణ గోడలు కట్టరు... ప్రమాదాలు పట్టించుకోరు

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలం పాణింగిపల్లి-నెలపర్తిపాడు రోడ్డులో టేకి డ్రెయిన్ మీద పాత వంతెనకు రక్షణ గోడలు చాలా వరకూ విరిగిపోయాయి. దానితో ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణీకులు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల ఈ రహదారిని బాగా అధునికీకరించారు. రోడ్డు బాగుండడంతో వాహనదారులు వేగంగా ప్రయాణిస్తున్నారు. ఈ వంతెన వద్ద రోడ్డు మలుపు కూడా తిరిగి ఉంటుంది. దానిని గమనించని కొందరు ఆకస్మాత్తుగా వంతెనకు రక్షణ గోడ విరిగిపోవడాన్ని గమనించలేక అకస్మాత్తుగా బ్రేక్‌లు వేసి కింద పడిపోతున్నారు. ఆ సమయంలో అదుపు తప్పి వంతెన నుంచి ఎక్కడ కాల్వలోకి పడిపోతామోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇక్కడ ఒక కర్రకు ఎర్రజెండా కట్టి చేతులు దులిపేసుకున్నారని రక్షణ గోడలను పునః నిర్మించే యోచన చేయడం లేదని వాపోతున్నారు. సీతానగరంలో జరిగిన సంఘటనలు జరిగితే కానీ అధికారులు పట్టించుకోరేమోనన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వంతెన కట్టాలంటే ఎక్కువ నిధులు కావాలి. ఇపుడు అవి ఎలాగూ రావు. ఈ లోగా ప్రమాదాలు ఆగవు కదా. తక్కువ ఖర్చుతోనే అయ్యే ఈ రక్షణ గోడలు నిర్మాణమైనా పూర్తి చేస్తే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు అంటున్నారు.



పాణింగిపల్లి-నెలపర్తిపాడు మధ్యన ప్రమాదకరంగా రక్షణ గోడ లేని వంతెన

గొలుసు దుకాణంపై దాడి

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో మద్యం దుకాణాలు కొన్ని చోట్ల ప్రారంభించనే లేదు... ఒక వ్యక్తి మాత్రం గొలుసు దుకాణం తెరిచి మద్యం అమ్ముతుండటం విస్మయానికి గురిచేసిన సంఘటన జడ్.మేడపాడులో చోటుచేసుకుంది. మద్యందుకాణాల యజమానులు ప్రారంభానికి ఏర్పాట్లు చేసుకుంటుండటం, దుకాణాల మరమ్మతులతో త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే మండపేట రూరల్ పరిధి జడ్.మేడపాడు గ్రామంలో టి.అఖిల్ అనే వ్యక్తి బెల్ట్‌షాపు ప్రారంభించి మద్యం బహిరంగంగా అమ్ముతున్నాడు. దీంతో పోలీసులకు సమాచారం రావడంతో ఆదివారం అతని దుకాణాన్ని తనిఖీలు చేసి ఆరుబీర్లు, 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న ఎస్సై

ఉత్కంఠగా కబడ్డీ పోటీలు

మండపేట, న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర కళాశాలల కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం మండపేటలో ఉత్కంఠగా సాగాయి. ఈ సందర్భంగా సౌత్‌జోన్ కబడ్డీ జట్టును ఎంపిక చేశారు.

సౌత్ జోన్ బృందానికి ఎంపికైన క్రీడాకారులు వీరే: పీర్లదేవుడు (ప్రభుత్వ డిగ్రీకళాశాల, మండపేట), అడబాలమణికంఠ (పీఆర్ డిగ్రీ కళాశాల, కాకినాడ), మల్లాది శ్రీహరి (పీఆర్ డిగ్రీ కళాశాల,కాకినాడ), వాసుపల్లి దుర్గాప్రశాంత్ (ఐడియల్ కళాశాల, కాకినాడ), పాలెపు హరీష్ (ఐడియల్ కళాశాల, కాకినాడ), పొడుగు లోవబాబు (సిఎస్‌టిఎస్ కళాశాల, జంగారెడ్డి గూడెం), నల్లా నీల్‌కుమార్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండపేట), గురజాపు సూర్య చంద్రశేఖర్ (ఐడియల్ కళాశాల, కాకినాడ), బండారు అనిల్‌కుమార్ (ఐడియల్ కళాశాల, కాకినాడ), గాదా హరీష్ (నన్నయ కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్, రాజమహేంద్రవరం), కేతా దిలీప్ (డిఎన్ఆర్ కళాశాల, భీమవరం)

అదనపు ప్లేయర్లుగా: తాళ్లూరి విమలాకర్ (ఎస్‌సిఐఎం ప్రభుత్వ డిగ్రీకళాశాల, తణుకు), దమ్ము అఖిల్ (ఎస్‌కెవిటి ప్రభ్వు డిగ్రీకళాశాల, రాజమహేంద్రవరం), లోచర్ల ఎంకార్ (ఎస్ఎస్ఆర్ కళాశాల గోపన్న పాలెం, పశ్చిమగోదావరి జిల్లా), బాదా రాహుల్ (ప్రభుత్వ డిగ్రీకళాశాల), రంపచోడవరం.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



సిద్ధివినాయకుడికి పూజలు

అయినవిల్లి: సంకటహర చతుర్థి పర్వదినం సందర్భంగా ఆదివారం సిద్ధి వినాయకస్వామి ఆలయం కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు, అయ్యప్పస్వాములు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే : ద్రాక్షారామ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో వెల్ల ఫీడరులో ఈ నెల 22వ తేదీ మంగళవారం మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ కె.రత్నాలరావు తెలిపారు. ఫీడరు పరిధిలోగల ద్రాక్షారామ, వెల్ల, వెల్లసావరం, తాడిపల్లి, కాపవరం గ్రామాలకు సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

మండపేట, న్యూస్టుడే: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, పట్టణ ఎస్సై హరికోటి శాస్రి తెలిపారు. రహదారి భద్రతపై పట్టణ ఎస్సై హరికోటి శాస్త్రితో కలిసి ఆదివారం రాత్రి సీఐ తన కార్యాలయంలో ఆటోయూనియన్ నాయకులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కలువపువ్వు సెంటరు నుంచి ఏడిద రోడ్డు, అంగర, కాలేరువైపు వెళ్లే ఆటోలు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తమకు కేటాయించిన యూనియన్ స్టాండ్‌ల వద్ద మాత్రమే నిలపాలన్నారు. ఆటోలు నడిపే సమయంలో ప్రయాణికుల కోసం ఎక్కడ పడితే అక్కడ రోడ్డపై అడ్డుగా ఆటోలు నిలపరాదన్నారు. విద్యార్థులను తరలించే ఆటోలు పరిమితికి మించకూడదన్నారు. గంజాయి, సారా,అక్రమ మద్యం వంటి వాటిని అక్రమంగా రవాణా చేసినా అటువంటి వాటికోసం ఆటోలు వినియోగించినా సీజ్ చేస్తామన్నారు.



ఆటో యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న సిఐ, ఎస్సై

నేడు నూతన ఆర్టీసీ బస్సు ప్రారంభం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో నూతన అల్ట్రా డీలక్స్ ఆర్టీసీ బస్సును రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారని డిపో మేనేజర్ పి.భాస్కరరావు తెలిపారు. ఈ బస్సును రామచంద్రపురం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు నడపనున్నట్లు వెల్లడించారు.

మంత్రిని కలిసిన ఏజీపీ

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం కోర్టు సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా నియమించినందుకు రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఆదివారం ఏజీపీ లకాని పద్మకమలకుమారి మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను తప్పక నెరవేరుస్తానన్నారు.

కార్మికులారా మేలుకోండి.. రూ.110 చెల్లించండి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న కార్మిక సంక్షేమ ఫలాలు అందుకునేందుకు వారధిగా కార్మికశాఖ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. భవన, అసంఘటిత రంగ కార్మికులంతా మేల్కొని ఐదేళ్ల కొకసారి రూ.110 చెల్లిస్తే చాలంటూ అధికారులు చెబుతున్నారు.

వీరందరూ అర్హులే...

కార్మికశాఖ దృష్టిలో రాళ్ల పగులకొట్టే పనివారు, తాపీ, వడ్రంగి, పెయింటర్స్, రాడ్ బెండింగ్, సెంట్రింగ్, ప్లంబింగ్, మెకానిక్, ఎలక్ట్రీషియన్, బావులను త్రవ్వుట, పూడిక తీయుట, వెల్డర్స్, బంటా మేస్త్రీలు, మేస్త్రీ, రోడ్లు, కాలువలపై మందు పిచికారి, కలప, చిప్స్ ప్యాకింగ్ పనివారు, ఇల్లు నేసేవారు, కాంక్రీట్ మిక్సింగ్, మిక్చర్ డ్రైవర్, పంపు ఆపరేటర్, రోలర్ డ్రైవర్, కళాసీ, సరంగి, వాచ్‌మెన్, మొజాయిక్, సొరంగం పనివారు, రాతి క్వారీ, మార్బుల్, రోడ్డు నిర్మాణ కార్మికులు, నూతులు తవ్వేవారు, సున్నం వేసే కార్మికులు, ఎన్ఆర్జీజీ పనివారు, ఇటుక బట్టీ, క్వారీ, స్టోన్, క్రషింగ్, బ్రిక్స్, సీలింగ్ వర్కర్లు తదితరులను కార్మికులుగా గుర్తిస్తున్నారు.

మీ కోసం

కార్మికులుగా నమోదు ఎలా..

కార్మికునిగా ప్రభుత్వంలో నమోదు చేసుకునేందుకు కార్మిక శాఖ కార్యాలయం(రామచంద్రపురం, రత్నంపేట)లో దరఖాస్తు ఉచితంగా పొందవచ్చు. దరఖాస్తుతోపాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రూ.110లు (రిజిస్ట్రేషన్ ఫీజురూ.రూ.50లు, ఐదేళ్ల ధ్రువీకరణ రుసుం రూ.60 మొత్తం రూ.110లు) వీటి కోసం కార్మికుని రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కార్మికుని బ్యాంకు ఖాతా జిరాక్సు కాపీలు, నామిని ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్సులు తప్పనిసరిగా ఉండాలి.

లబ్ధి ఇలా.. పొందొచ్చు

కార్మికశాఖలో నమోదై బీమా సొమ్ము చెల్లించిన కార్మికులు లబ్ధి విషయానికి వస్తే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షల ఆర్థిక సహాయం, కార్మికులు సహజంగా మరణిస్తే రూ.60వేలు, సహజ మరణం ప్రమాదవశాత్తు మరణించిన కార్మికునికి దహన సంస్కార ఖర్చుల నిమిత్తం రూ.20వేలు, కార్మికుని పిల్లల వివాహం సందర్భంగా రూ.20వేలు, వివాహ కానుక, ప్రసూతి వైద్య సహాయం రూ.20వేలు శాశ్వత అంగవైకల్యానికి శాతాన్ని బట్టి రూ.50వేల నుంచి రూ.5లక్షలు సహాయం ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి

ఎంతో శ్రమ పడి కుటుంబాన్ని పోషించుకునే కార్మికులంతా తప్పనిసరిగా ప్రభుత్వం దృష్టిలో కార్మికునిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి కార్మికుడు తమ వెనుక ఒక కుటుంబం ఉందన్న విషయాన్ని గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. తమ కార్యాలయానికి వస్తే తగిన సహాయ సహకారాలు అందిస్తారు.

- ఎ.విజయ్ ప్రకాష్, సహాయ కార్మికశాఖ అధికారి, రామచంద్రపురం